

కార్తి సందడి

నంబూరు వీవీఐటీ కళాశాలలో సోమవారం ప్రముఖ కథానాయకుడు కార్తి సందడి చేశారు. కార్తి, అరవిందస్వామి నటించిన తాజా చిత్రం 'సత్యం సుందరం' విజయోత్సవ యాత్రలో భాగంగా వచ్చారు. శరత్ అనే విద్యార్థి పెన్సిల్‌తో కార్తి బొమ్మ గీసి బహుమతిగా అందజేశారు. ఆయనతో కలిసి విద్యార్థులు సెల్ఫీలు దిగి, నృత్యాలు చేశారు.

- న్యూస్‌టుడే, పెదకాకాని

2 నుంచి గుంటూరులో రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన

మంగళగిరి: రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శనను గుంటూరు సిద్ధార్థ గార్డెన్స్ రింగ్ రోడ్డులోని చంద్రమౌళినగర్ వద్ద ఈ నెల రెండో తేదీ నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు చేనేత జౌళిశాఖ కమిషనర్ జి. రేఖారాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చేనేత జౌళి శాఖ మంత్రి సవిత వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలు, మాస్టర్ వీవర్స్ వద్ద సుమారు రూ.165 కోట్ల విలువైన వివిధ రకాల చేనేత వస్త్రాలు ఉన్నట్లు తెలిపారు. వీటి అమ్మకాల కోసం రాష్ట్రంలో, దేశ వ్యాప్తంగా ఉన్న 80 చేనేత సహకార సంఘాలు, మాస్టర్ వీవర్స్ తమ వస్త్ర ఉత్పత్తులను ప్రదర్శిస్తారని తెలిపారు.

ఈనాడు అమరావతి
గుంటూరు

వ్యవసాయం చేసేది వైకాపా వారేనా?

రాయితీ పరికరాలన్నీ ఆ పార్టీ వారికే

రైతు బృందాల పేరుతో కట్టబెట్టిన నాటి సర్కారు

ఈనాడు - అమరావతి

సాగును లాభసాటిగా మార్చే లక్ష్యంతో.. కూలీల ఖర్చు తగ్గించి, సమయం, సొమ్ము ఆదా చేసేలా వ్యవసాయ యాంత్రీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. రైతులకు రాయితీపై వివిధ పరికరాలిచ్చి ప్రోత్సహిస్తున్నాయి. గత ఐదేళ్ల జగన్ పాలనలో ఈ పథకం కేవలం వైకాపా కార్యకర్తలకే పరిమితమైంది. తొలుత రాయితీపై పరికరాలివ్వని నాటి ప్రభుత్వం.. చివరి రెండేళ్లలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల పేరుతో రైతు భరోసా కేంద్రానికి ఒక యూనిట్ మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యేలు చెప్పిన వైకాపా నేతలు, కార్యకర్తలే రైతు బృందాల్లో చేరి ఆ పరికరాలు పొందారు.

పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం చెంఘిజ్‌ఖాన్‌పేటలో వెన్నముద్ద గోపాలస్వామి రైతు బృందానికి సీహెచ్‌సీ కింద ట్రాక్టరు, ఇతర వ్యవసాయ పరికరాలిచ్చారు. వీటిని కేవలం ఈ బృంద సభ్యులే సొంతానికి వాడుకుంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన అద్దెకు ఇతరులెవ్వరికీ ఇవ్వడం లేదు.

బాపట్ల మండలం ముత్తాయపాలెంలో పృథ్వి రైతుమిత్ర గ్రూపు సభ్యులకు రాయితీపై వ్యవసాయ పరికరాలిచ్చారు. వీరందరూ వైకాపావారే. ఇతర రైతులకిచ్చింది చాలా తక్కువ. దీంతో ప్రభుత్వ రాయితీ అన్నదాతలకు అక్కరకు రాకుండాపోయింది.

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం వైఎస్సార్ రైతు గ్రూపు పేరుతో ఐదుగురు బృందంగా ఏర్పడి ట్రాక్టరుతోపాటు రాయితీ పరికరాలు పొందారు. బృందంలో నివారు ఒక్కొక్కరు ఒక్కో పరికరం తీసుకుని వాడుకుంటున్నారు. వీరికే తప్ప తోటి రైతులకు ఉపయోగపడని పరిస్థితి.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 862 రైతుభరోసా కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో ఒక్కో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఐదుగురు రైతులను ఒక బృందంగా ఏర్పాటు చేసి రూ. 15 లక్షల విలువైన పరికరాలిచ్చారు. ఇందులో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నుంచి 50 శాతం రుణం తీసుకోవాలని తప్పనిసరి చేశారు. మిగిలింది రైతు చెల్లిస్తే ఆయా కంపెనీలు పరికరాలు సరఫరా చేస్తాయి. ఇవి చేతికందాక రైతు ఖాతాకు మొత్తం యూనిట్ వ్యయంలో 40 శాతం సొమ్మును ప్రభుత్వం జమ చేస్తుంది. ఈ పరికరాలను రైతులు బృందంగా వాడుకుని, తోటివారికి వ్యవసాయశాఖ నిర్దేశించిన అద్దెకివ్వాలి. ఇందుకు విరుద్ధంగా బృందాల్లోనివారే వ్యక్తిగతంగా వాడుకున్నారు. దీంతో ప్రభుత్వం ఇచ్చిన రాయితీ కొందరు వైకాపా నేతలు, కార్యకర్తలకే పరిమితమైంది. మిగిలిన రైతులకు అద్దెకివ్వలేదు. దీంతో చిన్నసన్నకారు రైతులు మార్కెట్ ధర చెల్లించి పరికరాలను కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది. కొనలేనివారు అధిక అద్దెకు వినియోగించుకున్నారు. వరి విస్తారంగా పండించే ప్రాంతాల్లో క్లస్టర్లకు రాయితీపై ఇచ్చిన కంబైన్డ్ హార్వెస్టర్లు కూడా వ్యక్తిగతంగానే వాడుకున్నారు.







నెరవేరని యాంత్రీకరణ లక్ష్యం

గత వైకాపా సర్కారు తీరు కారణంగా వ్యవసాయంలో యాంత్రీకరణ అన్నది అందరికీ అందలేదు. అర్హులను కాకుండా నాటి వైకాపా ఎమ్మెల్యేలకు నచ్చినవారిని ఎంపిక చేసి పరికరాలిచ్చారు. అంతేకాదు నాటి జగన్ సర్కారు యాంత్రీకరణకు నామమాత్రంగానే నిధులు కేటాయించింది. కేంద్రం నుంచి వచ్చే నిధులకు సకాలంలో మ్యాచింగ్ గ్రాంటు విడుదల చేయకపోవడంతో పూర్తిస్థాయిలో ఉపయోగించుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రైతులకు వ్యక్తిగతంగా రాయితీపై పరికరాలిచ్చి ఆదుకోవాలని కర్షకులు కోరుతున్నారు.



రాఘవేంద్ర శీతలగిడ్డంగి రికార్డు గదిని సీజ్ చేసిన నల్లపాడు పోలీసులు, మిర్చియార్డు అధికారులు

మిర్చి వ్యాపారి చేతివాటం

- శీతలగిడ్డంగిలోని రైతుల సరకు అమ్మేసిన వైనం
- మిగిలిన మిర్చిపైనా రూ.3 కోట్ల మేర రుణం తీసుకొని మోసం

మిర్చియార్డు, న్యూస్‌టుడే: గుంటూరు మిర్చియార్డు సమీపంలోని నల్లపాడు రోడ్డులో ఉన్న రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ ఉంచిన మిర్చిని రైతులకు తెలియకుండా వ్యాపారి కొంత అమ్మేసి, ఇంకొంత సరకుపై రూ.కోట్లు రుణం తీసుకొని మోసం చేసిన వైనం వెలుగుచూసింది. ఇందులో శీతలగిడ్డంగి యాజమాన్యం పాత్రపైనా అధికారులు ఆరా తీస్తున్నారు. అధికారులు, బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు, ప్రకాశం, కర్నూలు జిల్లాలకు చెందిన 300 మంది రైతులు పాతగుంటూరుకు చెందిన లక్ష్మి చిల్లీస్ ఎక్స్‌పోర్ట్స్ యజమాని రామచంద్రరావు అలియాస్ రాము ద్వారా దాదాపు 2 వేల మిర్చి బస్తాలను రాఘవేంద్ర శీతలగిడ్డంగిలో నిల్వ చేశారు. రాము 880 మిర్చి బస్తాలను రైతులకు తెలియకుండా అమ్మేశారు. మరో వెయ్యి బస్తాలకు ఫోర్జరీ పత్రాల ద్వారా రెండు బ్యాంకుల్లో రూ.3 కోట్ల వరకు రుణం తీసుకున్నారు. మిర్చిని విక్రయించుకునేందుకు రైతులు శీతలగిడ్డంగి వద్దకు వస్తుంటే ఏవో సాకులు చెప్పి పంపుతున్నారు. కొంత మంది సోమవారం శీతలగిడ్డంగి వద్ద ఆందోళనకు దిగారు. 120 మిర్చి బస్తాలు నిల్వ చేసుకుంటే 100 బస్తాలు అమ్ముకుని.. 20 బస్తాలకు నకిలీ పత్రం ఇచ్చారని ప్రకాశం జిల్లాకు చెందిన పెద మల్లారెడ్డి వాపోయారు. సమాచారం అందుకున్న మిర్చియార్డు అధికారులు శీతలగిడ్డంగి మేనేజర్‌తో సంప్రదింపులు జరిపి రైతులకు బాండ్లు ఇప్పించారు. నాలుగు రోజుల క్రితం రామచంద్రరావు ఆత్మహత్యాయత్నం చేయడంతో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. రైతులు నల్లపాడు ఠాణాలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాఘవేంద్ర శీతలగిడ్డంగి రికార్డు గది సీజ్ : రాఘవేంద్ర శీతలగిడ్డంగి రికార్డు గదిని నల్లపాడు పోలీసులు, మిర్చియార్డు అధికారులు సీజ్ చేశారు. శీతలగిడ్డంగి యాజమాన్యం మోసం చేసిందని బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడకు వచ్చిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తక్షణమే రికార్డులను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. మిర్చియార్డు పర్సన్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు సూచన మేరకు మార్కెటింగ్ అధికారులు, నల్లపాడు పోలీసులు రికార్డు గదికి తాళం వేశారు. గిడ్డంగి యజమాని శివనాగిరెడ్డి, మేనేజర్ వెంకటేశ్వరరెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తియ్యగూర శీతలగిడ్డంగి రికార్డు రూమ్‌ను కూడా సీజ్ చేశారు.

ఎంపీ విజయసాయిరెడ్డి పీఏనంటూ రూ. 15 లక్షలు స్వాహా!

పర్యాటక శాఖలో ఉద్యోగం పేరుతో టోకరా

ఎస్పీకి బాధితుల ఫిర్యాదు



జగన్, విజయసాయిరెడ్డి, అనిల్‌కుమార్, అమర్‌నాథ్‌లతో ఈశ్వర్‌రెడ్డి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వైకాపా నాయకుడు, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పీఏనని ఒక్క రోజులో పర్యాటకశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 15 లక్షలు తీసుకొని మోసగించాడంటూ గుంటూరు శ్యామలానగర్‌కు చెందిన మణెమ్మ, కుమారుడు యెనోష్ ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదికలో ఎస్పీ సతీష్‌కుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ ప్రత్యేక దర్యాప్తునకు ఆదేశించారు. మణెమ్మ విలేకరులతో మాట్లాడుతూ.. 'నా భర్త ప్రసాద్‌బాబు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా నరసరావుపేటలో పనిచేస్తున్నప్పుడు ఈశ్వర్‌రెడ్డి తాను ఎంపీ విజయసాయిరెడ్డి పీఏగా పరిచయం చేసుకున్నాడు. అనేక రిజిస్ట్రేషన్ పనులు చేయించుకున్నాడు. విజయసాయిరెడ్డితోపాటు అప్పటి సీఎం జగన్, మంత్రులతో దిగిన ఫొటోలు చూపించి వారితో తనకు మంచి పరిచయాలున్నాయని ఉద్యోగాలిప్పిస్తానని నమ్మించాడు. 2023 ఏప్రిల్‌లో అప్పటి ఏపీ టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీతోపాటు, టూరిజం డైరెక్టర్ మల్‌రెడ్డి తనకు మంచి స్నేహితులని చెప్పాడు. రూ. 15 లక్షలిస్తే మా అబ్బాయికి పర్యాటకశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని నెలకు రూ. లక్ష జీతం వస్తుందన్నాడు. ఆ మాటలు నమ్మి రూ. 15 లక్షలు గతేడాది ఏప్రిల్‌లో తాడేపల్లిలో ఈశ్వర్‌రెడ్డికి అతని కార్యాలయంలో ఇచ్చాం. ఆ తర్వాత ఎన్నోసార్లు అతని చుట్టూ తిరిగాం. మోసగించాడని నిర్ధారించుకొని గత ఎన్నికలకు ముందు మా డబ్బు ఇవ్వాలని అడిగాం. కొంత తాను తీసుకోగా మిగిలింది టూరిజం శాఖ అధికారులు తీసుకున్నారని ఇక ఆ నగదు ఇవ్వనని, కులం పేరుతో తిట్టాడ'ని తెలిపారు.

జీజీహెచ్‌కు కొత్త కళ

- అసంపూర్తి భవనాల పూర్తికి చర్యలు
- దాతల సహకారంతో పట్టాలెక్కుతున్న ప్రణాళికలు

ఈనాడు - అమరావతి

ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)లోని అసంపూర్తి భవనాల నిర్మాణాన్ని దాతల సహకారంతో పట్టాలెక్కించడానికి ప్రణాళికలు చకచకా రూపుదిద్దుకుంటున్నాయి. ఇటీవల కలెక్టరేట్‌లో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధికి ఆర్థికంగా చేయూతనిస్తామంటూ దాతలు ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి పనుల పూర్తికి, కొత్త భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కేంద్రసహాయ మంత్రి యంత్రాంగాన్ని ఆదేశించారు.



జీజీహెచ్‌లో అసంపూర్తిగా ఉన్న సర్వీస్ బ్లాకు నిర్మాణం

సర్వీస్ బ్లాక్ పూర్తికి ముందుకొచ్చిన తులసీ ప్రభు

గత తెదేపా ప్రభుత్వ హయాంలో 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో తలపెట్టిన జీ+4 సర్వీస్ బ్లాక్ నిర్మాణాన్ని అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఒక్క రూపాయి కూడా వెచ్చించలేదు. ఈ పనుల పూర్తికి ఒకవైపు దాతలు, మరోవైపు ప్రభుత్వపరంగానూ చర్యలు ఊపందుకున్నాయి. ఇటీవలే నిధుల కోసం లేఖ రాయగా ఉన్నతాధికారులు స్పందించి హెచ్ ఆఫ్ అక్కౌంట్ వివరాలు తీసుకున్నారని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు డాక్టర్ పెమ్మసాని దృష్టికి తీసుకెళ్లారు. అదే సమావేశంలో పాల్గొన్న ప్రముఖ పారిశ్రామికవేత్త తులసీ రామచంద్రప్రభు తన సొంత నిధులు రూ. 5 కోట్లతో ఆ నిర్మాణం పూర్తి చేస్తానని ముందుకొచ్చారు. ఈ బ్లాక్ కోసం రాష్ట్రం ఇచ్చే నిధులను ఇతర అవసరాలకు వినియోగించుకుందామని డాక్టర్ పెమ్మసాని సూచించారు. ఈ భవనం పూర్తయితే నాలుగు సర్వీసులు అందుబాటులోకొస్తాయి.

నాట్కో కేన్సర్ కేంద్ర విస్తరణ..

మరోవైపు నాట్కో కేన్సర్ కేంద్ర విస్తరణకు గత ఫిబ్రవరిలో ఎంవోయూ కుదరగా.. ఇప్పటి వరకు స్థలం అప్పగించలేదని, భవనం నిర్మించి సాధ్యమైనంత త్వరగా రోగులకు అందుబాటులోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నామని నాట్కో ఆసుపత్రి సమన్వయకర్త వై. అశోక్‌కుమార్ చెప్పారు. కేంద్రసహాయ మంత్రి జోక్యంతో కలెక్టరు వెంటనే స్థలం స్వాధీనం చేయడంతో అక్కడున్న పాత భవనాల తొలగింపు పనులు సోమవారం మొదలయ్యాయి.

బొంగరాలబీడులో విభాగాల నిర్మాణం

జీజీహెచ్ భవిష్యత్తు అవసరాల కోసం గతంలో తెదేపా హయాంలో బొంగరాలబీడులో కార్మిక శాఖకు చెందిన 6 ఎకరాలను కేటాయించారు. గత వైకాపా ప్రభుత్వ.. ఆ స్థలంలో చిన్నపిల్లల వైద్యశాల నిర్మించాలని హడావుడి చేసి వదిలేసింది. తాజాగా అక్కడ కంటి, దంత, చర్మ సంబంధిత విభాగాలు ఏర్పాటు చేసి జీజీహెచ్‌పై రద్దీ తగ్గించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం వీటికి జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డుల్లేవు. సర్వీస్ బ్లాక్ నిర్మాణానికి ఏపీఎంఎస్ఐడీసీ ఇవ్వనున్న నిధులను బొంగరాలబీడులో వెచ్చించాలని అధికారులు భావిస్తున్నారు. ఈలోగా ఆ భూములు కబ్జాకు గురికాకుండా వెంటనే ప్రహరీ నిర్మించాలని నిర్ణయించారు. కేంద్రసహాయ మంత్రి చంద్రశేఖర్ చొరవతో పలు నూతన భవనాల నిర్మాణానికి దాతలు ముందుకు రావడంతో రోగులకు ఇబ్బందులు తప్పనున్నాయి. ఇటీవల పూర్వ విద్యార్థులు సైతం జీజీహెచ్ అభివృద్ధికి చేయూతనిస్తామని చెప్పారు. పొదిలి ప్రసాద్ మిలీనియం బ్లాక్ నిర్మించిన డాక్టర్ పొదిలి ప్రసాద్ మరోసారి ఆ బ్లాక్‌లో రోగుల కోసం పలు నిర్మాణాలు చేపట్టడానికి ముందుకొచ్చారు.

తత్వశాస్త్ర అవసరాన్ని జాతీయ విద్యా సంస్థలు గుర్తించాయి

ఆచార్య అశోక్ వోహ్రా

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే : తత్వశాస్త్ర అవసరాన్ని గుర్తించిన జాతీయ విద్యాసంస్థలు, ఐఐటీ, ఎన్ఐటీలలో ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశాయని దిల్లీ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు అశోక్ వోహ్రా చెప్పారు. సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి శత జయంతి ఉత్సవాలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, మండలి బుద్ధ ప్రసాద్, విశ్రాంత ఆచార్యుడు అశోక్ వోహ్రా హాజరయ్యారు. ఆచార్య అశోక్ వోహ్రా రచించిన కొత్త సచ్చిదానందమూర్తి జీవిత చరిత్రను, ఆయన విగ్రహాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. అనంతరం ఆచార్య అశోక్ వోహ్రా మాట్లాడుతూ ఏఎన్‌యూలో పూర్తిస్థాయిలో తత్వశాస్త్ర విభాగాన్ని ఏర్పాటు చేసి బోధన, పరిశోధన అంశాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కొత్త సచ్చిదానందమూర్తి రచనలను ఇతర భాషలలోకి అనువాదం చేయాలన్నారు. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ మాట్లాడుతూ సచ్చిదానందమూర్తి పేరుతో ఏర్పాటు చేసిన అధ్యయన కేంద్రాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి మూర్తి ఎంతో కృషి చేశారని....ఆయనను గౌరవించుకోవడం మన బాధ్యత అని చెప్పారు. ఆచార్య కేఎస్ చలం మాట్లాడుతూ పేదరికం, హింస లేకుండా ఎలా జీవించాలో తత్వశాస్త్రం బోధిస్తోందన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ స్వరూపారాణి మాట్లాడుతూ రాడికల్ అద్వైతాన్ని ప్రతిపాదించిన రేషనలిస్ట్ తత్వవేత్త అని మూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య రత్నశీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఆచార్య త్రిమూర్తిరావు తదితరులు పాల్గొన్నారు.



ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి స్టాంప్‌ను విడుదల చేస్తున్న వెంకయ్యనాయుడు, కొత్త రమేష్, అశోక్‌కుమార్, మండలి బుద్ధప్రసాద్, కామినేని శ్రీనివాస్, కె. గంగాధరరావు, కేఎస్ చలం

వెంకయ్యనాయుడును కలిసిన విద్యార్థి సంఘాలు

ఏఎన్‌యూకి వచ్చిన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును ఏబీవీపీ, టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు మర్యాదపూర్వకంగా కలిశాయి. తాను ఏబీవీపీలో పనిచేసిన రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. వర్సిటీలో ఎలాంటి కార్యక్రమాలు చేస్తున్నారని ఆరా తీశారు. టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు హేమంత్, ఇతర నాయకులు ఆయన్ను సన్మానించారు.

ఇసుక చిక్కేదెలా?

- భారీగా పెరిగిన డిమాండ్
- వారం రోజులకు ఒకసారి స్లాట్
- గంటల వ్యవధిలోనే పూర్తవుతున్న బుకింగ్

ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు ఇసుక బుకింగ్ స్లాట్ తెరవగా..

సోమవారం తెల్లవారే సమయానికి 550 మంది వినియోగదారులు 12,500 టన్నులను బుక్ చేసుకున్నారు...

మరికొందరు ఎంతగా ప్రయత్నించినా.. అప్పటికే స్లాట్ ముగియడంతో నిరాశ తప్పలేదు.



ఈనాడు - అమరావతి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఒక్క తాళ్లాయపాలెంలో మాత్రమే ఇసుక నిల్వలున్నాయి. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో స్లాట్ తెరిచిన వెంటనే బుకింగ్ పూర్తవుతోందని భూగర్భ గనులశాఖ అధికారులు చెబుతున్నారు. ఉచిత ఇసుక విధానంలో భాగంగా అవసరమైనవారు సంబంధిత పత్రాలు జత చేసి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయాన్ని తెదేపా కూటమి ప్రభుత్వం కల్పించిన సంగతి తెలిసిందే. డిమాండ్ భారీగా ఉండడం, ఉమ్మడి జిల్లాలో ఒక్కచోట మాత్రమే నిల్వలు ఉండడంతో బుకింగ్ తెరిచిన గంటల వ్యవధిలోనే స్లాట్ ముగిసిపోతోంది. ఇసుక డిమాండ్‌ను గుర్తించిన ప్రభుత్వం వారానికోసారి ఆన్‌లైన్‌లో బుకింగ్‌కు అవకాశం ఇస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానాన్ని అమలు చేస్తున్నారు.

లభ్యత లేక...

భారీవర్షాల కారణంగా సెప్టెంబరు తొలివారంలో నిర్మాణాలు నిలిచిపోయాయి. కృష్ణా నదికి వరదలు రావడంతో ఇసుక రవాణాకు అడ్డంకులు ఏర్పడి కొన్నాళ్లపాటు బుకింగ్ నిలిపేశారు. వరదలకు ముందు బుక్ చేసుకున్నవారికి రహదారులను పునరుద్ధరించాక సరఫరా చేశారు. దీనికితోడు ఉమ్మడి జిల్లాలోని తాళ్లాయిపాలెంలో తప్ప మిగిలిన డంపింగ్‌యార్డుల్లో నిల్వలు నిండుకున్నాయి. లభ్యత లేక విపరీతమైన గిరాకీ పెరిగింది. మరోవైపు ఓపెన్ రీచ్‌లకు ఇంకా అనుమతులు రాకపోవడంతో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి.

☛ తాళ్లాయపాలెంలో తాజాగా బుక్ చేసుకున్నవారికి అక్టోబరు 5 వరకు సరఫరా చేస్తారు. ఇది పూర్తయ్యాక నిల్వ పరిమాణాన్ని బట్టి మళ్లీ వారం రోజులకు బుకింగ్ తెరుస్తారు.

☛ అర్ధరాత్రి ఆన్‌లైన్‌లో స్లాట్ ఇవ్వడం వల్ల తాము బుక్ చేసుకోలేకపోతున్నామని పలువురు వినియోగదారులు వాపోతున్నారు.

☛ వినియోగదారుల ఇబ్బందులను గుంటూరు జిల్లా సంయుక్త పాలనాధికారి భార్గవ్‌తేజ దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా రాష్ట్రవ్యాప్తంగా ఇసుక విధానంలో భాగంగా అర్ధరాత్రి తర్వాత బుకింగ్‌కు అనుమతిస్తున్నామన్నారు. ఇక నుంచి మధ్యాహ్నం 12 గంటలకు స్లాట్ తెరిచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒక డంపింగ్‌యార్డులోనే ఇసుక నిల్వలు ఉన్నందున డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. అక్టోబరు 15 నుంచి మరో నాలుగు రీచ్‌లకు అనుమతి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అవి అందుబాటులోకి వస్తే డిమాండ్ మేరకు సరఫరా చేస్తామన్నారు.

ఇన్‌ఛార్జి ఎస్ఈగా మూర్తి



నూతన ఎస్ఈ మూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయకుమార్

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: కేంద్ర విద్యుత్తు పంపిణీ సంస్థ పరిధిలోని గుంటూరు సర్కిల్ ఇన్‌ఛార్జి పర్యవేక్షక ఇంజినీరుగా కేవీఎల్ఎన్ మూర్తిని నియమిస్తూ ఆ సంస్థ సీఎండీ పి. రవి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన వెంటనే ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈఈ టెక్నికల్‌గా పని చేస్తున్నారు. ఆయనకు త్వరలోనే ఎస్ఈగా పదోన్నతి రానుంది. అనంతరం గుంటూరు సర్కిల్ ఎస్ఈగా శాశ్వత ప్రాతిపదికన నియమించే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. అంకితభావంతో విధులు నిర్వహించి ఇప్పటికే ఉత్తమ అవార్డులను అందుకున్నారు. టెన్నిస్ క్రీడాకారునిగా విద్యుత్తు సంస్థ తరఫున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఇప్పటి వరకు ఎస్ఈగా పని చేస్తున్న విజయకుమార్‌ను నూతనంగా ఏర్పాటుచేసిన నరసరావుపేటకు సర్కిల్‌కు బదిలీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వెతలు తీరేలా..!

✦ తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ✦ రూ.86.68 లక్షలు నిధుల మంజూరు

పొన్నూరు, న్యూస్‌టుడే

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. తాగునీటి సౌకర్యం కల్పించేందుకు, మరుగు దొడ్ల నిర్మాణానికి రూ. 86.68 లక్షల నిధులు మంజూరు చేసింది. ఒక్కో కేంద్రానికి తాగునీటి సౌకర్యం కల్పనకు రూ. 17 వేలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 36 వేలు చొప్పున నిధులు ఇచ్చినట్లు శిశు సంక్షేమశాఖాధికారులు వెల్లడించారు. ఈ పనులను నిర్వహించే బాధ్యతలను గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం అధికారులకు అప్పగించారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ ఎం.ఉమాదేవి 'న్యూస్‌టుడే'కు వివరించారు.



పెదఐటికంపాడు ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం

జిల్లా పరిధిలో ఇలా..

కేంద్రాల సంఖ్య 1,486

తాగునీటి పథకాలు 188

నూతనంగా నిర్మించే మరుగుదొడ్లు 152

వైకాపా పాలనలో అధ్వానం..

గత వైకాపా పాలనలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వామని మాయ మాటలతో కాలయాపన చేశారు. చిన్నారుల మౌలిక వసతుల కల్పనకు ఎటువంటి నిధులు మంజూరు చేయలేదు. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది ప్రైవేటు వ్యాపారుల వద్ద మంచి నీటిని కొనుగోలు చేసి దాహార్తి తీర్చేవారు. కనీసం మరుగు దొడ్ల సౌకర్యం లేకపోవడంతో చిన్నారులు అత్యవసర సమయంలో ఆరు బయటకు పోవాల్సిన దుస్థితి. తగిన సౌకర్యాలు కల్పించాలని పలుమార్లు తల్లిదండ్రులు, నిర్వాహకులు వైకాపా నేతలు, శిశు సంక్షేమశాఖాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

జిల్లాకు 225 టన్నుల కందిపప్పు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో బియ్యం కార్డుదారులకు అక్టోబరు నెలలో కందిపప్పు సరఫరా కానుంది. ఈ మేరకు జిల్లాకు ఇప్పటికే 225 టన్నుల కందిపప్పు వచ్చింది. వాటిని జిల్లాలోని చౌక ధరల దుకాణాలకు సమానంగా పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారి లక్ష్మి తెలిపారు. అక్టోబరు 1వ తేదీ నుంచి జిల్లాలోని బియ్యం కార్డుదారులకు రాయితీ సరుకుల పంపిణీ జరుగుతుందని తెలిపారు.

కూటమి అభ్యర్థి గెలుపు కోసం పని చేయాలి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి గెలుపు కోసం 33 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఆయన సోమవారం గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమ ప్రారంభంలో పాల్గొన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేశాం కదా.. మన ఓటు ఎక్కడికి పోతుందని అనుకోవద్దని, అది చెల్లదని ఆయన పేర్కొన్నారు. కొత్తగా నమోదు చేసుకుంటేనే ఓటు హక్కు వినియోగించుకోగలుగుతారన్నారు. ఈ ఏడాది నవంబరులోపు పట్టభద్రులైన వారు ఓటు నమోదుకు అర్హులని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఫారం-18 దరఖాస్తులను తెనాలి తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నలకు అందించేందుకు వచ్చిన పట్టభద్రులతో కలిసి ఆయన ఆ కార్యాలయాలకు వచ్చారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

రైల్వే ప్రాజెక్టుల విస్తరణకు సహకరించాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి మౌలిక వసతులు, రైల్వే ప్రాజెక్టుల విస్తరణకు సహకరించాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నను దిల్లీలో సోమవారం కలిసి విన్నవించారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టుల గురించి ఆయన చర్చించారు. గుంటూరు జిల్లాలో పెరుగుతున్న జనభాకు అనుగుణంగా రైల్వే సేవల విస్తరణ జరగాలన్నారు. ట్రాఫిక్ రద్దీతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, వీటిని పరిష్కరించేందుకు తోడ్పాటు అందించాలని కోరారు. దీనికి రైల్వే మంత్రి సోమన్న సానుకూలంగా స్పందించారన్నారు.



కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నతో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్

రైతేరాజు

తైవాన్ జామతో నికరాదాయం

రైతులు నికర రాబడి కోసం ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెడుతున్నారు. చేబ్రోలుకు చెందిన రైతు నాగేశ్వరరావు తైవాన్ జామ సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు. ఈ జామను తక్కువ విస్తీర్ణంలో అయినా సాగు చేయొచ్చని ఆయన చెబుతున్నారు. సాగులో అనుభవాలను రైతు పంచుకున్నారు.



బాపట్ల జిల్లా పెదగాదెలవర్రు గ్రామంలోని నర్సరీ నుంచి మొక్క రూ. 40 చొప్పున కొనుగోలు చేశారు. 5 అడుగుల ఎడంతో ఎకరాకు 1800 నుంచి 2000 మొక్కలు నాటారు. నాటిన 6 నెలల నుంచి పంట కాపునకు వస్తుంది. రెండు నెలలకు ఒకసారి టన్ను నుంచి టన్నున్నర వరకు దిగుబడి వస్తుంది. మొక్కల కొనుగోలుకు రూ. 80 వేలు, నాటినందుకు మరో రూ. 10 వేలు, 15 రోజులకు ఒకసారి తడి అందిస్తూ.. ఎకరాకు ఒక బస్తా డీఏపీ చల్లుకోవాలి. దీనికోసం ఏడాదికి రూ. 36 వేలు ఖర్చవుతుంది. మొదటి ఏడాది రూ. 1,26,000 వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్లో కేజీ జామ ధర రూ. 40 నుంచి రూ. 50 వరకు పలుకుతోంది. సీజన్‌లో కేజీ రూ. 70 నుంచి రూ. 80 ధర లభిస్తోంది. వ్యాపారులే నేరుగా తోట వద్దకు వచ్చి కూలీలతో కోయించుకుని తీసుకు వెళుతున్నారు. నాటిన తొలి ఏడాదే అన్ని ఖర్చులు పోను రూ.లక్ష వరకు ఆదాయం రాగా, రెండో ఏడాది నుంచి నీటి తడులు, ఎరువులు, గడ్డి, పురుగు మందుల పిచికారీ నిమిత్తం రూ. 70 వేల వరకు ఖర్చు కాగా, రూ. 2.5 లక్షల వరకు ఆదాయం లభిస్తోంది.

ఈ ఏడాది మరో నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్నా..



ప్రతి సంవత్సరం కంపోస్టు ఎరువులు చల్లుకుంటాం.. ఎప్పటి కప్పుడు చెట్టు చుట్టూ శుభ్రం చేసుకోవాలి. కాయలు కోసిన అనంతరం కొమ్మలను తొలగించుకుంటే కొత్తగా చిగురు, పూత పిందె వస్తుంది. ఎండిపోయిన చెట్టు స్థానంలో కొత్త మొక్కలు నాటుకోవాలి. నాలుగేళ్ల కిందట రెండు ఎకరాల్లో తోటను సాగు చేశా. దిగుబడి, ఆదాయం బాగుండడంతో ఈ ఏడాది మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా.

– నాగిశెట్టి నాగేశ్వరరావు, రైతు, చేబ్రోలు

– చేబ్రోలు, న్యూస్‌టుడే

పొదుగు వాపు నివారణ చర్యలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

పశువులలో పొదుగు వాపు వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలను పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి సూచించారు. పాడి రంగాన ఈ వ్యాధి ఈనిన మొదటి 15 రోజుల్లో వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈనిన వెంటనే సహజంగా ఉండే రోగనిరోధక శక్తి తగ్గుతుంది. పాలు తీసే ముందు రైతు చేతులు సరిగ్గా శుభ్రం చేసుకోకపోవడం, పాత్రల్లో శుభ్రత లోపించడం, పొదుగు సరిగ్గా కడగకపోవడం వల్ల బయట నుంచి క్రిములు పాల ధార ద్వారా లోపలకు ప్రవేశించి వ్యాధి సంక్రమిస్తుంది. ఫలితంగా పాలలో కదుపులు రావడం, పాలు ఎరుపు రంగులోకి మారడం, పొదుగుపైనా పుండ్లు వచ్చే అవకాశం ఉంది.

నివారణ: శుభ్రత పాటించడం, పొటాషియం పర్మాంగనేట్ గుళికల ద్రావణంతో పొదుగు కడగడం, యాంటీ బయాటిక్స్, జెల్, మెగ్నషైన్ వంటి ఇంజక్షన్లు, మినరల్ మిక్చర్, అజోమాక్స్ వంటివి వాడడం ద్వారా ఈ వ్యాధిని అదుపులోకి తీసుకు రావొచ్చు.



వరి పంటను సుడి దోమ ఆశించి నష్ట పరుస్తోంది. నివారణ చర్యలు ఏమిటి?

–ఈదర వెంకటేశ్వర్లు, దొప్పలపూడి గ్రామం, పొన్నూరు మండలం



జిల్లాలో వరి ప్రస్తుతం సుమారు 70 వేల ఎకరాలు 75-80 రోజుల వయసులో ఉండి చిగురు/ అంకురం ఏర్పడే దశకు వస్తోంది. సుడి దోమ పిల్ల, పెద్ద పురుగులు దుబ్బు మొదళ్ల నుంచి రసం పీల్చడం వలన వరి పైరు సుడులు, సుడులుగా ఎండిపోయి దిగుబడి తగ్గుతుంది. దీని నివారణకు ఈ చర్యలు తీసుకోవాలి. సుడి దోమ ఉధ్రుతి ఎక్కువగా ఉంటే పొలంలో నీరు తీసేసి 3-4 రోజులు ఎండబెట్టాలి. ప్రతి 2 మీటర్లకు దారులు ఉండేలా చూసుకోవాలి. అంకురం ఏర్పడే దశలో ఎకరానికి 30 కిలోల యూరియాతోపాటు 15 కిలోల పొటాష్ ఎరువును కూడా వేసుకోవాలి. దుబ్బుకు పది సుడి దోమలు కంటే ఎక్కువ ఉంటే ఎకరానికి బావిరియా బాసియానా ఒక కిలో చొప్పున లేదా ఓషీన్ (డైనోటేఫ్యూరాన్) 80 గ్రా. లేదా చెస్ (పైమెట్రోజోన్) 120 గ్రా. లేదా ట్రైఫ్లూమ్‌జోప్రిమ్ 94 మి.లీ. పిచికారీ చేసుకోవాలి. వీటిలో బావీరియా బాసియాన్‌ను తక్కువ ధర, తక్కువ వాతావరణ కాలుష్యంతో సమర్థంగా వినియోగించుకోవచ్చు.



డాక్టర్ నగేష్

– జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే

వంగ పంటలో సస్యరక్షణ



వంగ సాగుపై రైతులు సరైన దృష్టి పెట్టి సస్యరక్షణ చర్యలు తీసుకోగలిగితే తెగుళ్లను నివారించుకోవచ్చని, దిగుబడులు పెంచుకోవచ్చని ఉద్యాన విస్తరణాధికారి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. దుక్కి, తర్వాత దశలోనూ సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను ఆయన వివరించారు. పురుగు ఆశిస్తే ఆ కాయలు, కొమ్మలను తుంచేసి చేనుకు దూరంగా వేయాలి. ఎకరాకు లింగాకర్షణ బుట్టలు నాలుగు ఏర్పాటు చేయాలి. ఎకరాకు 200 కిలోల వేపపిండి దుక్కిలో వేయాలి. బ్యాక్టీరియా, ఎండు తెగులు ఉంటే ఎకరాకు 6 కిలోల బ్లీచింగ్ పొడి వేసుకోవాలి. ట్రైకోడెర్మావిరిడీ కల్చర్‌ను ఎకరాకు కిలో వంతున దుక్కిలో వేయాలి. రసం పీల్చే పురుగు ఆశించకుండా ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలి.

– దుగ్గిరాల, న్యూస్‌టుడే

ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించండి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి ఫిర్యాదును సకాలంలో సక్రమంగా పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి అర్జీలు విధానపరమైన నిర్ణయాలతో పెండింగ్‌లో ఉంటే.. వాటి వివరాలు ఎండార్స్‌మెంట్ ద్వారా దరఖాస్తుదారులకు చెప్పాలన్నారు. కోర్టుల్లో నమోదైన కేసులకు రిట్ పిటీషన్ల దాఖలుకు చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ ఎ.భార్గవ్ తేజ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ఫిర్యాదులతో పాటు సీఎం ప్రజా వేదికలోనూ, మంత్రి నారా లోకేశ్ పీజీఆర్ఎస్‌లోనూ అందించిన వాటికి అధిక ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలన్నారు. ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించిన అర్జీని సక్రమంగా ఎండార్స్ చేయకపోవడంతో సదరు ఏఈకి షోకాజు నోటీసులు జారీ చేయాలని ఆర్అండ్‌బీ ఎస్ఈని ఆదేశించారు. 190 అర్జీలు అందాయని అధికారులు తెలిపారు.



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

కనీస సదుపాయాలు కల్పించండి

మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డును ఆనుకున్న మల్లికార్జునపురంలో కనీస సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మల్లికార్జునపురం కాలనీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు తాళ్ల సాంబశివరావు, అనుమోలు ఏడుకొండలు, బాబూరావు, సూర్యారావు, రాంబాబు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. విద్యాసంస్థల నుంచి వచ్చే వృథా నీరు అపార్ట్‌మెంట్ల చుట్టూ వచ్చి రోడ్లపైనే నిలుస్తుందన్నారు.

రెండేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోరా



ప్రత్తిపాడు మండలం మల్లాయపాలెంలోని తమ పొలాన్ని ఆనుకుని పక్కన వ్యక్తి అనుమతులు లేకుండా తొమ్మిది అడుగుల లోతుతో కాలువను తవ్వారు. వర్షాలకు తమ పొలంలో మూడు అడుగులకు పైగా మట్టి కాలువలోకి కొట్టుకుపోయింది. రెండేళ్ల కిందట అధికారులకు విన్నవించగా కాలువను పూడ్చివేయిస్తామని, జరిమానా కట్టించుకుంటామన్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వర్షాలొస్తే.. పంట వేసేందుకు వీల్లేకుండా పోతుంది.

- కుర్రి సుబ్బాయమ్మ, కుర్రి వెంకటరత్న

రాజకీయ కారణాలతో తొలగించామంటున్నారు



నాలుగేళ్లుగా దివ్యజ్యోతి గ్రామైక్య సంఘ వీఓఏగా పని చేస్తున్నా. ఉన్నట్టుండి రాజకీయ కారణాల వల్ల తొలగించామని ఏపీఎం చెబుతున్నారు. సంఘ పరిధిలో ఎక్కడా నాపై ఫిర్యాదు రాలేదు. గతంలో నిధులు దుర్వినియోగానికి పాల్పడిన వీఓఏను తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. నాకు చిన్న పిల్లలు ఉన్నారు. క్యాన్సర్ వ్యాధితో మా అత్త బాధపడుతున్నారు. ఉన్న ఒక్క జీవనాధారం పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా. నన్ను తిరిగి విధుల్లోకి తీసుకోండి.

- దొప్పలపూడి ధనలక్ష్మి, తక్కెళ్లపాడు

వాలంటీర్లను కొనసాగించాలని వినతి

రాష్ట్రంలోని గ్రామ, వార్డు వాలంటీర్లను యథావిధిగా కొనసాగించాలని ఏపీ వాలంటీర్ అసోసియేషన్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య మాట్లాడుతూ కరోనా సమయంలో వాలంటీర్లు ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. వాలంటీర్లను కొనసాగిస్తూ రూ.10 వేలు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఏఐటీయూసీ నాయకులు అరుణ్‌కుమార్, హనుమంతరావు, వాలంటీర్లు కోలా రాజేష్, వెంకట నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దొరకని తల్లీబిడ్డల ఆచూకీ



బందరు కాలువలో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

పటమట, న్యూస్‌టుడే: విజయవాడ స్క్రూబ్రిడ్జ్ సమీపంలోని బందరు కాలువలో ఆదివారం దూకిన వివాహిత తిరుపతి సుధారాణి, కుమార్తె జాస్విల ఆచూకీ తెలియరాలేదని పటమట పోలీసులు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రెండు రోజులుగా వారి కోసం గాలిస్తున్నారు. సోమవారం స్క్రూబ్రిడ్జి నుంచి యనమలకుదురు వరకు కాలువను జల్లెడ పట్టినా వారి ఆచూకీ లభ్యమవ్వలేదు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వచ్చి ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కుటుంబ కలహాల నేపథ్యంలో తల్లి తన ఇద్దరు పిల్లలతో కాలువలో దూకగా.. అందులో నాలుగు నెలల చిన్నారి మృతి చెందిన సంగతి తెలిసిందే.

45,264 మిర్చి బస్తాల విక్రయం

మిర్చియార్డు: మిర్చియార్డుకు రైతులు సోమవారం 52,124 బస్తాలు తరలించారు. అందులో 45,264 బస్తాల విక్రయాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 27,326 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ. 8,500-17,000, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ. 9,000-18,600, తాలు మిర్చికి రూ. 5,000-11,000 ధర లభించింది

రూ.20 కోట్లతో మరో క్యాన్సర్ వార్డు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రి నాట్కో క్యాన్సర్ కేంద్రానికి అనుబంధంగా రూ.20 కోట్ల వ్యయంతో అదనంగా మరో వార్డును నిర్మించేందుకు నాట్కో ట్రస్టు ముందుకు రావడం అభినందనీయమని సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ కొనియాడారు. నూతన వార్డు నిర్మాణానికి వీలుగా అక్కడున్న పురాతన భవనాన్ని తొలగించే పనులను సోమవారం ప్రారంభించారు. అనంతరం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు క్యాన్సర్ చికిత్సకు గుంటూరు వస్తున్నందున పడకలు సరిపోవడంలేదన్నారు. ఈ సమస్యను గుర్తించిన నాట్కో ఫార్మా సీఎండీ వీసీ నన్నపనేని, ఉపాధ్యక్షుడు సదాశివరావు స్పందించి మరో 150 పడకలతో వార్డును నిర్మించేందుకు ముందుకు వచ్చారన్నారు. ఇందుకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. సెల్లార్‌తోపాటు నాలుగు అంతస్తుల భవనం ఇక్కడ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఏడాది గడువులో ఈ పనులు పూర్తి కావచ్చన్నారు. పాత భవనం తొలగింపు పనులు పూర్తయిన వెంటనే కొత్త వార్డు పనులకు భూమిపూజ చేయనున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం లెవల్-2 క్యాన్సర్ సెంటర్‌గా గుర్తింపు పొందిన ఈ కేంద్రం త్వరలోనే లెవల్-1 స్థాయికి చేరనుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆంకాలజీ విభాగం అధిపతి శివరామకృష్ణ, నాట్కో క్యాన్సర్ కేంద్రం సమన్వయకర్త అశోక్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

శాశ్వత ప్రాతిపదికన పని చేసేవారిని క్రమబద్ధీకరించాల్సిందే

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో శాశ్వత పని ప్రాతిపదికన పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల, పీస్‌రేట్, ఎన్ఎంఆర్, డైలీ వేజ్, థర్డ్ పార్టీ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి డిమాండ్ చేశారు. గుంటూరులో సోమవారం నిరసన ప్రదర్శన అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. రమాదేవి మాట్లాడుతూ ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు అతి తక్కువ వేతనాలతో జీవనం సాగిస్తున్నారన్నారు. శాశ్వత ప్రాతిపదిక పని చేసే వారిని సైతం అత్యవసర సర్వీసులతో సహా ఒప్పంద, పొరుగు సేవల పేరుతో నడపడం సరికాదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఉన్నా అమలు కావడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు ఇవ్వడంలేదన్నారు. పనిచేసే చోట మహిళలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ సెప్టెంబర్ నెలంతా జిల్లాలోని ప్రయివేటు సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులను సర్వే చేశామన్నారు. పంచాయతీ కార్మికులు, ఉన్నత విద్యాలయాలు, ప్రయివేటు విద్యాసంస్థలు అనేక చోట్ల కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, నాయకులు వి.దుర్గారావు, హుస్సేన్ వలి, ముత్యాలరావు, భాగ్యరాజు, రమేష్‌బాబు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

బ్రాయిలర్ ధరలు

(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 143, చికెన్ విత్‌స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

తెనాలి

•తెనాలి •పొన్నూరు

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించండి

ప్రజాఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో 9 అర్జీలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో మొత్తం 9 అర్జీలు వచ్చాయి. సబ్ కలెక్టర్ సంజనా సింహ అర్జీదారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. గర్భిణులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరుతూ గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ తరఫున నటరాజన్, ఇతర ప్రతినిధులు వినతిపత్రం అందించారు. ఉపాధి హామీ కింద కొందరికే పని లభిస్తోందని, విద్యుత్తు లో ఓల్టేజి, ట్రాఫిక్ తదితర అంశాలపై అర్జీలు వచ్చాయి. వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. గాంధీ దేశం ట్రస్ట్ వారు తొలుత పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు. గాంధీ మార్గ ప్రచారం, ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు.



సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న గాంధీ దేశం సంస్థ ప్రతినిధులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : శాంతిభద్రతలు, గంజాయి నిర్మూలన వంటి అంశాల్లో రాజీ పడవద్దని, ట్రాఫిక్ ఇబ్బందులను వీలైనంత వరకు దూరం చేయాలని సబ్ కలెక్టర్ సంజనా సింహ సూచించారు. ఆమె సోమవారం తన కార్యాలయంలో డీఎస్పీ బి.జనార్దనరావు ఇతర అధికారులతో సమావేశమై డివిజన్‌లో నేరాల తీరు, కేసుల అంశాలను చర్చించారు.

పెదకాకానిలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

పెదకాకాని, న్యూస్‌టుడే : దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన పెదకాకాని భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు రెండో రోజు సోమవారం కొనసాగాయని ఈవో గోగినేని లీలాకుమార్ తెలిపారు. మంగళవాయిద్యం, చతుర్వేద పారాయణం, గణపతి, లక్ష్మి, అస్త్ర, నవగ్రహ హోమ పూజలు, గోపూజ మంత్ర పుష్పం నిర్వహించారు. చివరి రోజు మంగళవారం భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి విశేష వ్రత చరిత పూజ, పవిత్రాల సమర్పణ వంటి వివిధ పూజలు జరుగుతాయని ఈవో తెలిపారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల దాతలు

చిన్నారుల ఆరోగ్యం అందరి బాధ్యత

కొల్లిపర, న్యూస్‌టుడే : పోషకాహారం తీసుకున్న గర్భిణి ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మ ఇస్తుందని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు వెంకటలక్ష్మి అన్నారు. పోషకాహార వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని సోమవారం కొల్లిపర అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రులతో, గర్భిణులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం ఉచితంగా పోషకాహారం అందిస్తోందని పేర్కొన్నారు. గ్రామంలో ప్రదర్శన చేశారు. క్లస్టరు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తల ప్రదర్శన

కళ.. భళా

వ్యర్థాలకు కళాత్మక అర్థాలు
పర్యావరణహిత ప్రయత్నాలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

వ్యర్థాలకు కళాత్మక అర్థాలనిస్తూ.. అవకాశం ఉన్నంత వరకు పర్యావరణహిత విధానాలతో విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు రేకెత్తించే ప్రయత్నం చేస్తున్నారు నాగేశ్వరరావు మాస్టారు. తెనాలి పట్టణానికి చెందిన ఏ.నాగేశ్వరరావు బీఎస్సీ చదివారు. చిత్రలేఖనంలో డిప్లొమా, చేతి రాతలో సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేశారు. 2009వ సంవత్సరం నుంచి వివిధ ప్రయివేటు పాఠశాలల్లో చిత్రకళ, చక్కటి చేతిరాత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ వేలాది మంది విద్యార్థులకు కళను పరిచయం చేశారు. సాధారణ బొమ్మలు వేయడమే కాకుండా భారీ కటౌట్లతో పాటు అతి చిన్న విభిన్న రూపాలను ఆవిష్కరించడంలో ఆయన నేర్పరి. అందునా వాటి తయారీలో పర్యావరణ హిత విధానాలు పాటిస్తూ విద్యార్థులకు కొత్త దారులు చూపుతున్నారు.

☛ సాధారణ ఫ్లెక్సీలు, రసాయన వినైల్ వస్తువులు కాకుండా ప్రింటింగ్ ప్రెస్‌లలో వాడి పారేసిన మందం ఛార్టులు, గడ్డి, పాత దుస్తులు వంటి వాటిని ఉపయోగిస్తూ సహజ రంగులు వాడుతూ ఆవిష్కరణలు చేస్తున్నారు.

☛ సంక్రాంతి సమయంలో గ్రామీణ వాతావరణ ఆవిష్కరణ, దీపావళి సమయంలో నరకాసురుడు ఇలా ఆయా సందర్భాలను అనుసరించి విద్యార్థులతో కలిసి ఆయన చేసిన ఆవిష్కరణలు సృజనాత్మకతను కళ్లకు కడతాయి. దసరా పండగ నేపథ్యంలో సరికొత్త ప్రయత్నాల్లో ఉన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ కొత్తగా ఆలోచిస్తేనే కళ మనస్సుకు హత్తుకుంటుందన్నారు. అలా పిల్లల్లో ఆలోచనలు కలిగించడంతో పాటు వీలైనంత వరకు సహజ వస్తువులు వినియోగించే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. విభిన్న ఆలోచన అనేది వారికి భవిష్యత్తుల్లో ప్రతి అంశంలోనూ ఉపయోగపడుతుందన్నారు.



పేపర్‌తో కొబ్బరి బోండాలను రూపొందించి సహజ రంగులు అద్దుతున్న నాగేశ్వరరావు



ఛార్టులతో రూపొందిన 40 అడుగుల ఎత్తు హనుమంతుడి విగ్రహం, పర్ణశాల



గడ్డి, దుస్తులతో తయారైన 16 అడుగుల ఎత్తు నరకాసురుడి ప్రతిమ

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

పారిశుద్ధ్యం, కుక్కలపై అధికార పక్ష సభ్యుల నిలదీత

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

తెనాలి పురపాలక సంఘ సాధారణ సమావేశం అధికార, ప్రతిపక్ష సభ్యుల నిలదీత మధ్య వాడీవేడిగా సాగింది. సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో పనిచేసిన వంద మంది అదనపు పారిశుద్ధ్య కార్మికులకు వేతనాల కింద రూ.9.60లక్షలు చెల్లించేందుకు బిల్లు ఆమోదం తెలిపే అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా వైకాపా కౌన్సిలర్ రామయ్య మాట్లాడుతూ ప్రత్యేక కార్యక్రమంలో మినహా ఇతర రోజుల్లో చెత్త తరలింపడం లేదని, గుట్టలుగా పేరుకుపోతుందని పేర్కొన్నారు. వాహనాలు మూలన పడినా నెలల పాటు మరమ్మతులు చేయించడంలో అధికారులు నిమ్మక నీరెత్తినట్లు ఉన్నారని ఎండగట్టారు. శాశ్వత, పొరుగుసేవల కార్మికుల్లో ఖాళీలు భర్తీ చేయకపోవడంతో కొరత ఉందని ఈ ప్రభావం పారిశుద్ధ్యంపై పడుతోందని ఆరోగ్యాధికారిణి హెలెన్ నిర్మల బదులిచ్చారు. కొందరు మున్సిపల్ అధికారులు, కొందరు పారిశుద్ధ్య కార్మికులను పలు విభాగాల్లో వినియోగించుకుంటున్నట్లు ఆమె వివరించారు.

☛ వార్డు సచివాలయ పరిధిలో జనాభా, వార్డుల్లో జనాభాకు మధ్య వ్యత్యాసం ప్రభావం, అభివృద్ధి పనులకు విఘాతం కలిగిస్తోందని తెదేపా సభ్యుడు పిన్నాబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల దరఖాస్తుల్లో సంతకం చేద్దామంటే, మీ సచివాలయం పరిధిలో లబ్ధిదారుడు కాదని చెప్పారని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్య పట్టణమంతటా ఉందని పరిష్కారం చూపాలని కోరారు. ఇదే సమస్య తామూ ఎదుర్కొంటున్నట్లు 13, 15 వార్డుల వైకాపా కౌన్సిలర్లు కోటేశ్వరరావు, సుజాత చెప్పారు. అవి విధానపరమైన సమస్యలని, వాటి పై కౌన్సిల్‌లో తీర్మానించి ప్రభుత్వానికి నివేదిక పంపించి శాశ్వత పరిష్కారానికి కమిషనర్ బండి శేషన్న బదులిచ్చారు.

☛ గురవయ్య కాలనీ శివారు రోడ్డులో వరుస చేసిన చోట మళ్లీ వ్యర్థాలు పోశారని 11వ వార్డు అధికార పార్టీ కౌన్సిలర్ రత్నకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యులు అజెండాలోని 14వ అంశం మినహా మిగిలిన 17 అంశాలకు ఆమోదం తెలిపారని, ఛైర్‌పర్సన్ గంట మోగించి, సమావేశం ముగిసిందని ప్రకటించారు. తొలుత ఇతర మున్సిపాలిటీల నుంచి బదిలీ పై వచ్చిన అధికారులు, సిబ్బందిని సభ్యులకు కమిషనర్ పరిచయం చేశారు.



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, తెదేపా సభ్యుడు అన్నం పిన్నాబాబు

శునకాల నియంత్రణేది?

వీధికుక్కలు వెంటపడి మరీ కరుస్తున్నాయని వార్డు వాసులు భయాందోళన చెందుతున్నారని మూడు నెలల కిందట నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని వైకాపా సభ్యురాలు తియమలశెట్టి సాయిమాధురి ప్రశ్నించారు. అధికార పార్టీ కౌన్సిలర్ గోపి పట్టించుకోవడం లేదన్నారు. వీధి కుక్కల సంతాన నిరోధక శస్త్రచికిత్స చేసే షెడ్డు చుట్టూ వ్యర్థాల జలాలు చేరడంతో శస్త్ర చికిత్స చేసేందుకు వీలు పడడం లేదని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న బదులిచ్చారు. రాబోయే రెండు నెలల్లో మిగిలిన 653 వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు.

‘సందేశమివ్వండి.. సమస్య పరిష్కరిస్తా’

పొన్నూరు, న్యూస్‌టుడే : పొన్నూరు నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో తెదేపా ఓటమి చెందడంతో ఎన్నో పాఠాలు నేర్చుకున్నానని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. అమెరికాలోని డల్లాస్‌లో తెలుగువారు మూడు దశాబ్దాల ప్రజా ప్రస్థానం పేరిట నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖ మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి ఆశయ సాధన కృషి చేస్తున్నానన్నారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే తన కర్తవ్యమన్నారు. ఏ సమస్య ఉన్నా ఫోన్‌లో సందేశం పంపిస్తే, పరిశీలించి త్వరగా పరిష్కరిస్తానన్నారు. తెదేపా నాయకులు రించెల చర్యలు తీసుకుంటామని చెప్పారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

విజేతలకు బహుమతి ప్రదానం

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర- 2047 విద్యార్థులలో దార్శనిక ప్రణాళిక తయారీలో భాగంగా జిల్లా స్థాయిలో స్థానిక డీఆర్‌డీఏలో వివిధ రకాల పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వం, చర్చా పోటీలు నిర్వహించారు. వివిధ మండలాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో శైలజ, ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ విజయలక్ష్మి, ఉపవిద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, ఎంఈవో జయశంకర్ పాల్గొన్నారు. **వ్యాసరచన..** పి.సజ్జ(నారాకోడూరు జడ్పీ హైస్కూల్), టి.ఐశ్వర్య (ఉప్పలపాడు), ఆర్.లోకేశ్వరి (కొల్లిపర) విజేతలుగా నిలిచారు. వక్తృత్వం. . జె.స్నేహశ్రీ (మంగళగిరి వీవర్స్‌కాలనీ మున్సిపల్ హైస్కూల్), డి.ధరణి (నారాకోడూరు), బి.సోమసహస్ర (ఉండవల్లి ఎంపీయూపీ స్కూల్) గెలుపొందారు. చర్చా పోటీల్లో.. ఎం.లహరి, డి.ధరణి(నారాకోడూరు), జె.సుప్రియ, వి.తరుణి, (మాచవరం, పొన్నూరు మండలం), ఎస్.పూజసహస్ర, సీహెచ్.అనుహ్య (పచ్చలతాడిపర్రు డాన్‌బోస్కో ఉన్నత పాఠశాల, పొన్నూరు మండలం) విద్యార్థినులు వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం: ఆలపాటి

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే : త్వరలో జరగనున్న గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేయాలని పార్టీ పెద్దలు తనను కోరారని తెనాలి మాజీ శాసనసభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. సోమవారం ఏఎన్‌యూలో కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి ఉత్సవాల్లో ఆలపాటి పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఈ ప్రాంతానికి చెందిన సచ్చిదానందమూర్తి విద్యారంగంలో అనేక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. ఆయన తెనాలి ప్రాంతానికి చెందిన ఆణిముత్యమని చెప్పారు. తిరుమల క్షేత్రాన్ని అపవిత్రం చేసిన జగన్ అనేక నిర్ణయాలు తీసుకున్నారని ఆలపాటి ఆరోపించారు. ఆయన విధానాల వల్లే లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు పరిధి నిడుబ్రోలు రైలుపేటలోని మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. వాటిని తొలగించాలి.
- రాంబాబు, రైలుపేట

✔ వ్యర్థాలు తొలగించే విధంగా తగు చర్యలు తీసుకుంటా.
- శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి

? పొన్నూరు శ్రీనగర్ కాలనీలో మూడు రోజుల నుంచి చెత్తను తొలగించలేదు. దుర్వాసన వస్తోంది.
- పి. లక్ష్మీకుమారి, శ్రీనగర్‌కాలనీ

✔ చెత్త తొలగించే విధంగా చర్యలు తీసుకుంటా.
- శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి

? తెనాలి చినరావూరు తోట శ్రీ గీతాంజలి పబ్లిక్ స్కూల్ రోడ్డులో తాగు నీటి పైపుల కోసం గతంలో రోడ్డు పగలగొట్టి తిరిగి మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేశారు.
- సుబ్రహ్మణ్యం, చినరావూరు తోట

✔ త్వరలో మరమ్మతులు చేయిస్తాం.

? తెనాలి యడ్లలింగయ్య కాలనీ మసీదు చెంతనే ఉన్న ప్రధాన మురుగు కాలువ పూడిక, చెత్తతో నిండిపోయింది. పారుదల లేక దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం.
- కరిముల్లా, యడ్లలింగయ్య కాలనీ

✔ సత్వరం సమస్యను పరిష్కరిస్తాం.

- పై ప్రశ్నలకు మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న సమాధానాలు ఇచ్చారు.

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

✦ పాత పొన్నూరులో వ్యర్థాలు పేరుకుపోయాయని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ప్రజారోగ్యశాఖాధికారులు చెత్త తొలగించారు.

స్పందనకు వందనం

నేడు మంత్రి నాదెండ్ల రాక

కొల్లిపర, న్యూస్‌టుడే: పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం మండల పరిధిలోని అన్నవరం, అన్నవరపులంక, బొమ్మువానిపాలెం, హనుమాన్‌పాలెం గ్రామాల్లో జరిగే పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపీడీవో విజయలక్ష్మి సోమవారం తెలిపారు.

నిడుబ్రోలు సొసైటీలో అక్రమాలపై విచారించాలి

పొన్నూరు, న్యూస్‌టుడే : వైకాపా ఐదేళ్ల పాలనలో నిడుబ్రోలు సొసైటీలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని రైతులు జీడీసీసీ బ్యాంకు ఏజీఎం శ్రీనివాసన్ సోమవారం కోరారు. సొసైటీలో పంపిణీ చేస్తున్న ఎరువులను స్థానిక రైతులకు ఇవ్వడం లేదని, సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని కార్యదర్శి సుధాకర్‌కు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఏజీఎంకు ఫిర్యాదు చేశారు. సొసైటీలో రుణాలు చెల్లించే సమయంలో నగదు జమ చేసిన రైతులకు ఎటువంటి రశీదులు ఇవ్వడంలేదని ఆయన ముందు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. రుణాల పంపిణీలో కూడా అనేక అక్రమాలు జరిగాయని వాటిపై విచారణ చేయాలని కోరారు. అనంతరం ఏజీఎం శ్రీనివాసన్ మాట్లాడుతూ నిడుబ్రోలు సొసైటీలో అక్రమాలు జరిగాయని రైతుల ఫిర్యాదు మేరకు విచారణ చేసి నివేదికను ఉన్నతధికారులకు అందజేస్తామని వెల్లడించారు.



జీడీసీసీ బ్యాంకు ఏజీఎం శ్రీనివాసన్‌తో మాట్లాడుతున్న రైతులు

మొక్కల పెంపకంలో భాగస్వాములు కావాలి

పొన్నూరు, న్యూస్‌టుడే : మొక్కల పెంపకంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవశ్యకత ఉందని విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యక్షుడు లావు రత్తయ్య పేర్కొన్నారు. సోమవారం విజ్ఞాన్ యూనివర్సిటీలో ట్రీ బేస్ట్ ఎంటర్‌ప్రైజ్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను (టీబీఈఐసీ) ఇండియాలోని యూఎస్‌ఏఐడీ జనరల్ డెవలప్‌మెంట్ ఆఫీస్ డైరెక్టర్ టెగెన్‌ఫెల్‌డెట్ మార్కుతో కలిసి రత్తయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపకులపతి పి.నాగభూషణ్,రిజిస్ట్రార్ ఎంఎస్.రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.



విజ్ఞాన్‌లో ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టెగెన్‌ఫెల్‌డెట్ మార్కు, లావు రత్తయ్య

ఏపీ శాఖకు జాతీయ పురస్కారం



అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ టీచర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సెప్టెంబరు 27, 28 తేదీల్లో భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ స్థాయి వేడుకలో ఆంధ్రప్రదేశ్‌కు ఉత్తమ రాష్ట్ర శాఖ- 2024 పురస్కారం లభించిందని రాష్ట్ర అధ్యక్షుడు, తెనాలి ఏఎస్‌ఎన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటరమణ సోమవారం తెలిపారు. తానూ, ఇతర ప్రతినిధులు పురస్కారం అందుకున్నట్లు పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

2న జంతువధ నిషేధం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న పట్టణంలో జంతువధ పై నిషేధం విధించినట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాంసం, చేపలు అమ్మకందారులు దుకాణాలు, కబేళా మూసివేయాలన్నారు. అల్పాహారశాలలు, రెస్టారెంట్లలో మాంసాహార పదార్థాలు తయారు చేయవద్దని సూచించారు.

అగ్నిప్రమాద బాధితులకు తోడ్పాటు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : అంగలకుదురు గ్రామంలో అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన రెండు కుటుంబాలకు తహసీల్దార్ గోపాలకృష్ణ రెవెన్యూ విభాగం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి సోమవారం నిత్యావసరాలు అందించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు మొవ్వా సత్యనారాయణ రూ.7 వేల నగదు ఇచ్చారు. కార్యక్రమంలో భానుమతి, రాజ్యలక్ష్మి, నాగభూషణం, జానీరసూల్, బుజ్జిబాబు, శ్రీమన్నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని ఎస్టీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవంపై తహసీల్దార్ మాట్లాడారు. తన కార్యాలయంలో రేషన్ పంపిణీపై సమీక్ష నిర్వహించారు.

సిబ్బందిని ఆదుకోండి


తెనాలి టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ఆమోదించిన క్రమంలో తమ ఉద్యోగాలకు సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి స్పష్టతా రాలేదని తెనాలిలోని ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది వాపోయారు. ఈ మేరకు తెనాలి డిపో అధికారికి తమను ఆదుకోవాలని వినతిపత్రం సోమవారం ఇచ్చారు. అక్టోబరు 1 నుంచి విధులకు హాజరుకాబోమని వివరించారు.

వాహనాల తనిఖీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : తెనాలి-విజయవాడ మార్గంలో సోమవారం అధికారుల బృందం ఆకస్మికంగా వాహనాల తనిఖీ చేపట్టింది. నిబంధనలు పాటించని 6 వాహనాలపై కేసులు నమోదు చేశారు. రెండు వాహనాలను సీజ్ చేసి రూ.45 వేలు అపరాధ రుసుం విధించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్, రవాణా శాఖ అధికారులు మధుసూదనరావు, అమృతవాణి ఇతర అధికారులు ఉన్నారు.

మోదీ నాయకత్వంలో అగ్రగామిగా భారత్

పెదకాకాని, న్యూస్‌టుడే : ప్రధాని మోదీ నాయకత్వంలో తీసుకున్న నిర్ణయాలతో భారత్ సాంకేతిక రంగంలో అగ్రగామిగా నిలుస్తోందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ అన్నారు. నంబూరు వీవీఐటీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. 160 మంది విద్యార్థులు రక్తం ఇచ్చారు. వారికి యామిని శర్మ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఐఎల్‌జే భక్తాసింగ్ పాల్గొన్నారు.



రక్తదానం చేసిన విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న సాధినేని యామిని శర్మ

స్వచ్ఛత అందరి లక్ష్యం కావాలి



ప్రతిజ్ఞ చేస్తున్న రాధిక, శేషన్న, కోటేశ్వరరావు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : ఇంటితోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యర్థాలు కాలువల్లో పడవేయవద్దని, ప్లాస్టిక్‌కు బదులు వస్త్ర సంచులు వాడాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్న, కౌన్సిలర్ కోటేశ్వరరావు పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. వారు సోమవారం 15వ వార్డులో నిర్వహించిన స్వచ్ఛత ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. స్వచ్ఛత అందరి లక్ష్యం కావాలని వారు సూచించారు.

ఎంపీ నిధులతో సీసీ రోడ్డు

కొల్లిపర, న్యూస్‌టుడే : మండల పరిధిలోని అన్నవరంలో రూ. 3.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నామని పంచాయతీ రాజ్ ఇన్‌ఛార్జి ఏఈ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం పనులను ఆయన పర్యవేక్షించారు. సర్పంచి తాతారావు, తదితరులున్నారు.

ఇలా ఉంటే రాకపోకలు ఎలా?

పొన్నూరు, న్యూస్‌టుడే : మండల పరిధి కట్టెంపూడి అడ్డరోడ్డు వద్ద రహదారిపై వర్షపు నీళ్లు నిలుస్తుండటంతో రాకపోకలు నిర్వహించేందుకు స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి నీళ్లు నిలవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రహదారిపై నిలిచిన వర్షపు నీరు

వరద బాధితులకు చేయూత

తాడేపల్లి, న్యూస్‌టుడే: వరద బాధితులకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన దాతలు అండగా నిలిచారు. సోమవారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విరాళాలు అందజేశారు. తెనాలి పిడపర్తిపాలేనికి చెందిన అరుణోదయ మహిళా గ్రూప్ ఆధ్వర్యాన రూ.1.21 లక్షలు విరాళంగా ఇచ్చారు.

పొన్నూరు తహసీల్దారుగా జియా

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: పొన్నూరు తహసీల్దారుగా జియా ఉల్ హక్‌ను నియమిస్తూ కలెక్టర్ నాగలక్ష్మి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. చేబ్రోలు డీటీగా బత్తుల శ్రీనివాసరావుకు పోస్టింగ్ ఇచ్చారు.

బాధలు వింటూ.. భరోసా ఇస్తూ..

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

తాడేపల్లి, న్యూస్‌టుడే: గ్రామంలోని శ్రీచింతలమ్మతల్లి దేవస్థానం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని దుగ్గిరాల మండలం శృంగారపురానికి చెందిన గ్రామస్థులు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. తాడేపల్లి మండలం ఉండవల్లి నివాసంలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో మంత్రి ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలు తెలుసుకున్నారు. విజయవాడకు చెందిన ఉమా చిట్ ఫండ్ ఆస్తులు విక్రయించి డిపాజిట్ దారులను ఆదుకోవాలని నూతక్కికి చెందిన పి.శ్రీనివాసరావురెడ్డి వినతి అందజేశారు. దివ్యాంగుడైన తమ కుమారుడికి వీల్‌ఛైర్ అందించాలని కుంచనపల్లికి చెందిన లక్ష్మీ తిరుపతమ్మ దంపతులు కోరగా.. మంత్రి అప్పటికప్పుడే కొత్త వీల్‌ఛైర్‌ను అందించి మానవత్వం చాటుకున్నారు.



వృద్ధురాలి సమస్య వింటున్న మంత్రి లోకేశ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: వరద బాధితులకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన దాతలు అండగా నిలిచారు. సోమవారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విరాళాలు అందజేశారు. తెనాలి పిడపర్తిపాలేనికి చెందిన అరుణోదయ మహిళా గ్రూప్ ఆధ్వర్యాన రూ.1.21 లక్షలు, కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన ఎం. ధనలక్ష్మి రూ.లక్ష విరాళంగా ఇచ్చారు.

నేడు

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఉండవల్లి నివాసంలో మంగళవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు మంగళగిరి నియోజకవర్గ తెదేపా కార్యాలయం నుంచి సోమవారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి 7 మధ్య వచ్చిన వారికే ప్రవేశం ఉంటుందన్నారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

నైపుణ్య గణన

తుళ్లూరు, న్యూస్‌టుడే: సోమవారం తుళ్లూరులో సచివాలయ సిబ్బంది, సీఆర్డీఏ అధికారులు నైపుణ్య గణన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి తిరిగి కుటుంబంలోని యువత నైపుణ్య వివరాలు నమోదు చేసుకున్నారు.



తుళ్లూరులో సర్వే చేస్తున్న గ్రామ సచివాలయ సిబ్బంది

దృష్టిసారిస్తేనే ఆదాయం..!

వినియోగంలోకి రాని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు

తాడేపల్లి, న్యూస్‌టుడే

నగరంలో స్వచ్ఛత నెలకొల్పడంతోపాటు ఆదాయం సృష్టించే విధంగా తెదేపా హయాంలో మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేసిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను గత వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. పిచ్చిమొక్కలు పెరిగి అసాంఘిక శక్తులకు ఆవాసాలుగా మారాయి. ఒక్కో కేంద్రాన్ని రూ.20 నుంచి రూ.30 లక్షల వ్యయంతో నిర్మించారు. ఇంటింటా చెత్తను సేకరించి ట్రాక్టర్లు, ఆటోల ద్వారా కేంద్రాలకు తీసుకొచ్చి తడి, పొడి చెత్తను వేరుచేసి వాటితో ఎరువు తయారుచేసి రైతులకు రైతు సేవా కేంద్రాలకు విక్రయించి సంపదను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటిని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావాలని భావిస్తున్నారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరం, మెల్లెంపూడి వంటి ప్రాంతాల్లో ఉన్నవాటికి నగరపాలక అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు కానీ చెత్తను వేరు చేసే పనులు చేపట్టలేదు. అన్ని చోట్లా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సంకల్పించారు. నగరం నుంచి పెద్ద మొత్తంలో చెత్తను సేకరిస్తున్న నగరపాలక అధికార్లకు వీటిని వినియోగించాలని ఆలోచన రాకపోవడం గమనార్హం.



కుంచనపల్లిలో పిచ్చిమొక్కల మధ్య ...

నగర పరిధిలో ఇలా..

డివిజన్లు: 53, జనాభా: 2.35 లక్షలు

గృహాలు: 72 వేలు, కేంద్రాలు: 14

రోజువారీ ఉత్పత్తి అవుతున్న చెత్త: 125 మెట్రిక్ టన్నులు



వడ్డేశ్వరంలో నిరుపయోగంగా ఇలా..

సమకూరని డంపింగ్ యార్డు

నేటికీ కార్పొరేషన్‌కు డంపింగ్ యార్డు సమకూరలేదు. ఫలితంగా ఆటోలతో చెత్తను తరలించి కొలనుకొండ వద్ద కొండ పక్కనే డంప్ చేసి అక్కడ నుంచి గుంటూరుకు తరలిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తడి, పొడి చెత్తను వేరుచేసేందుకు ఏర్పాటైన కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తే ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

చర్యలు చేపడతాం

చెత్త సంపద కేంద్రాల పరిస్థితిని మున్సిపల్ పరిపాలనా విభాగం దృష్టికి తీసుకువెళ్లి వాటి వినియోగానికి తీసుకోవలసిన చర్యలపై చర్చిస్తామన్నారు. తడి, పొడి చెత్త వేరుచేసేందుకు ఏర్పాటుచేసిన కేంద్రాలు వద్ద అపరిశుభ్రత తొలగిస్తాం. - షేక్ అలీం బాషా, మున్సిపల్ కమిషనర్

ఏఈగా ఆంజనేయులు

వట్టిచెరుకూరు: అప్పాపురం ప్రధాన వాహిని సాగునీటి పారుదల సహాయక ఇంజినీరుగా ఆంజనేయులు సోమవారం నియమితులయ్యారు. ఆయన వరకాయలపాడు మేజరు కాలువ పర్యవేక్షణ ఇంజినీరుగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన కోటేశ్వరరావు పులిచింతల ప్రాజెక్టుకు బదిలీ అయ్యారు.

గ్రామ సభల్లోనే కౌలు రైతులను గుర్తించాలి

మంగళగిరి: గ్రామ సభల్లోనే నేరుగా కౌలు రైతులను ఎంపిక చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య కోరారు. మంగళగిరిలోని వ్యవసాయశాఖ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్యకార్యదర్శి రాజశేఖర్, కమిషనర్ ఢిల్లీరావుని కలిసి వినతిపత్రాలను సోమవారం అందజేశారు. భూమి యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు.

సనాతన ధర్మ పరిరక్షణకు దీపారాధన

పెదకాకాని(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణకు దీపారాధన కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు జనసేన ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు అన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ అంశంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ప్రత్తిపాడు నియోజకవర్గం పెదపలకలూరు 40 డివిజన్‌లో శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో దీపారాధన కార్యక్రమాన్ని జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జునరావు, ఉపాధ్యక్షులు శివనాగేశ్వరరావు, స్థానిక మహిళలతో పాటు దీపాలు వెలిగించారు

అండగా నిలిచి.. దాతృత్వం చాటి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం పెదనందిపాడు మండలం వరగాని గ్రామస్థులు సోమవారం ఎల్ఎం పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎమ్మెల్యే రామాంజనేయులును కలిసి రూ.1,20,216 విలువైన చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డి. శ్రీనివాస్, పి. వెంకటప్పయ్య, కె.సాంబశివరావు, కె.శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బాలకృష్ణ, సర్పంచుల సంఘ మాజీ అధ్యక్షుడు శౌరిబాబు తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాల: దుస్తులు సేకరిస్తున్న కేఎల్‌యూ ఏజీబీఎస్సీ విద్యార్థినులు



ఎమ్మెల్యే రామాంజనేయులుకు చెక్కు అందజేస్తున్న గ్రామస్థులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: కేఎల్‌యూ ఏజీబీఎస్సీ విద్యార్థినులు వరద బాధితుల కోసం సోమవారం దుగ్గిరాలలో ఇంటింటికీ తిరిగి బియ్యం, దుస్తులు, నగదు సేకరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

కాకుమాను, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. కాకుమానులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల సమస్యలను నేరుగా ఎమ్మెల్యేలు విని పరిష్కరించాలనే ఉద్దేశంతో తమను సీఎం చంద్రబాబు పంపించారన్నారు. గ్రామాలలో ప్రతి సమస్యను తెలుసుకుని ప్రాధాన్యత వారీగా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం చెప్పిన హామీలను నెరవేరుస్తుందన్నారు. 22ఎ లో ఉన్న భూములపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయా భూములను పరిశీలించి సబ్ డివిజన్ చేస్తారన్నారు. సబ్ డివిజన్ చేసి రైతుల భూమికి నంబరు కేటాయిస్తారన్నారు. ప్రాధాన్యత వారీగా రహదారులు, మురుగు కాల్వలు నిర్మిస్తామని చెప్పారు. ప్రజా వేదికలో 52 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు వెంకట స్వామి తెలిపారు. ఆయా అర్జీలను పరిశీలించి శాఖల వారీగా పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యుగ కీర్తి, తెదేపా నాయకులు సునీల్ చౌదరి, వీరయ్య చౌదరి, అగస్టిన్‌బాబు, రామ్ గోపాల్, పూర్ణ చంద్రరావు, పలు శాఖల అధికారులు గ్రామస్థులు పాల్గొన్నారు.



గ్రామస్థుడి సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

అర్చకులకు రక్షణ కల్పించాలి

తాడికొండ, న్యూస్‌టుడే: పొన్నెకల్లు గ్రామంలోని కాశీవిశ్వేశ్వర ఆలయ అర్చకుడు కొండవీటి బాపేశ్వరశర్మపై దాడి అమానుషమని, బాధ్యుడైన వెంకయ్యను వెంటనే అరెస్టు చేయకపోతే ఉద్యమం చేపడతామని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ హెచ్చరించారు. తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో శనివారం అర్చకుడిపై దాడి చేసిన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటి వరకు ఏవిధమైన చర్యలు తీసుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. అర్చకులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛతా సేవా సంఘం ప్రధాన కార్యదర్శి రామలింగేశ్వర శాస్త్రి, నాయకులు ఆంజనేయులు, శ్రీనివాస్ శర్మ, పవన్ శర్మ, మాధవ శర్మ, నాగకోటేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న వీసీ, వర్సిటీ ప్రతినిధులు

అంతర్జాతీయ పోటీల్లో సత్తా

తాడేపల్లి, న్యూస్‌టుడే: కేఎల్ విశ్వవిద్యాలయంలో ఈసీఈ చదువుతున్న ఆర్యాని ప్రపంచ స్కేట్ గేమ్స్- 2024లో టీమ్ ఇండియా తరపున పాల్గొని కాంస్య పతకం సాధించినట్లు వీసీ డాక్టర్ పార్థసారథివర్మ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రొవైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ రాజశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు తదితరులు ఆమెను అభినందించారు.

మద్యం దుకాణం తొలగించాలని వినతి

తాడేపల్లి, న్యూస్‌టుడే: మహానాడు, ఎన్టీఆర్ కరకట్ట మధ్య పంట పొలాల్లో ఉన్న మద్యం దుకాణం (బార్)ను తొలగించాలని ఐద్వా ఆధ్వర్యాన మహిళలు సోమవారం మండల ఉప తహసీల్దార్ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఐద్వా నాయకులు గిరిజ, ఉష, జ్యోతి, భ్రమరాంబ, సీపీఎం మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను కలసిన వారిలో ఉన్నారు.

ఆధునిక పద్ధతుల్లో బోధన అవసరం

పెదనందిపాడు: విద్యార్థులకు ఆధునిక పద్ధతులతో బోధన చేయాలని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. పెదనందిపాడు ఎంఎల్ పాఠశాలలో సోమవారం ఆ పాఠశాల పాలకవర్గ గౌరవ అధ్యక్షుడు శేషగిరిరావుతో కలసి ఆయన కృత్రిమ మేథ పరిశోధనశాలను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరంగా నైపుణ్యాలు పెంపుదల చేసుకోవాలని సూచించారు. విశ్రాంత ప్రిన్సిపల్ పి.బాల కుటుంబరావు, పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, నగరాజ కుమారి, ఉపాధ్యాయుడు రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

పానీపూరీ విక్రేతపై దాడి

తుళ్లూరు, న్యూస్‌టుడే: పానీపూరీ విక్రేతపై దాడి చేసిన ఘటన సోమవారం తుళ్లూరులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉద్దండరాయునిపాలెం గ్రామానికి చెందిన ఫిలిప్, సురేష్ స్థానిక తులసి థియేటర్ సెంటర్‌లో పానీపూరీ బండి వద్దకు వచ్చారు. మసాల పూరి కావాలని అడిగారు. నిర్వాహకుడు తమ వద్ద లేవని చెప్పటంతో ఎందుకు లేదంటూ అతనిపై రాడ్డుతో దాడికి దిగారు. బాధితుడు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం అమ్ముతున్న వైకాపా నాయకుడిపై కేసు

ఫిరంగిపురం గ్రామీణం: వైకాపా నాయకుడు అక్రమంగా మద్యం అమ్ముతూ పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని బేతపూడి గ్రామంలోని ఓ కూల్ డ్రింక్స్ షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని స్థానిక ప్రత్యేక పోలీసులు(స్పెషల్ బ్రాంచ్) ద్వారా సమాచారం అందిందని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఉదయం సీఐ రవీంద్రబాబు సిబ్బందితో కలిసి దుకాణంలో తనిఖీ చేసినట్లు చెప్పారు. మొత్తం 19 మద్యం సీసాలు పట్టుబడ్డాయని తెలిపారు. నిర్వాహకుడు షేక్ జాకీర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తెదేపా సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతికతను వినియోగించి తెదేపా సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం గుంటూరులోని జిల్లా తెదేపా కార్యాలయంలో తెదేపా క్లస్టర్, బూత్, యూనిట్, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి ఉమ్మడి అభ్యర్థిగా రాష్ట్ర తెదేపా నిర్ణయించిన అభ్యర్థిని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. నాయకులు నూతలపాటి రామారావు, ధనేకుల వెంకట సుబ్బారావు, కంచర్ల శివరామయ్య, నార్నె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తుళ్లూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

అగ్రస్థానంలో ఉండాలి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: తెదేపా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న సభ్యత్వ నమోదులో ప్రత్తిపాడును అగ్రస్థానంలో నిలపాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టరు బూర్ల రామాంజనేయులు కోరారు. గుంటూరు జేకేసీ కళాశాల రోడ్డులోని మౌర్య ఫంక్షన్ హాలులో సోమవారం తెదేపా సభ్యత్వ నమోదు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదుపై నియోజకవర్గ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ పరిశీలకురాలు భీమనేని వందనాదేవి, తెదేపా తెలుగు రైతు విభాగం రాష్ట్ర మీడియా సమన్వయకర్త గింజుపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి కల్లూరి శ్రీనివాసరావు, పార్టీ మండలాల అధ్యక్షులు శివరామ ప్రసాద్, లీలా మల్లేశ్వరరావు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం రూ. లక్ష విరాళం

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వరద బాధితుల సహాయం కోసం రాష్ట్ర తెదేపా మహిళా కార్యదర్శి పులి సువార్త, పులి చిన్నా దంపతులు లక్ష రూపాయలు విరాళం ఇచ్చారు. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్కు అందజేశారు.వరదల కారణంగా నష్టపోయిన వారికి తెదేపా నాయకులు అండగా నిలవాలని ముఖ్యమంత్రి పిలుపు విరాళం ఇచ్చినట్లు అమరావతి ఐకాస నాయకుడు పులి చిన్నా తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న పులి చిన్నా

ఎలక్ట్రిక్ బైక్ డిజైన్‌లో అవార్డులు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: తమ కళాశాల విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రికల్ బైక్ డిజైన్‌కు జాతీయస్థాయిలో అవార్డులు, నగదు బహుమతులు రావటం ఆనందంగా ఉందని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. కోయంబత్తూరులోని శ్రీరామకృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రిక్ బైక్ డిజైన్ ఛాలెంజ్ (ఈబీడీసీ24)- సీజన్ 4.0 పేరుతో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అభినందించారు. ప్రిన్సిపల్ కొల్లా శ్రీనివాస్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ తదితరులు విజేతలను అభినందించారు.

లంచం తీసుకుని రుణం ఇవ్వరేం..!

వెలుగు కార్యాలయ సిబ్బందిని నిలదీసిన మహిళ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: స్త్రీనిధి రుణం రూ.లక్ష కోసం రూ.4 వేలు లంచం తీసుకుని ఇప్పించకుండా సీసీ, యానిమేటరు తిప్పుతున్నారని చినకొండ్రుపాడు గ్రామానికి చెందిన ప్రియాంక మహిళా గ్రూపు లీడరు దానమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వెలుగు కార్యాలయం వద్దకు వచ్చి రూ.2 వేలు డబ్బులు తీసుకుని ఎందుకు రుణం ఇప్పించలేదని సీసీ సుబ్బారావును ఆమె నిలదీశారు. యానిమేటరు రోజా రూ.2 వేలు, సీసీ సుబ్బారావు రూ.2 వేలు లంచం తీసుకున్నారని, మూడు నెలల నుంచి తిప్పుతున్నారని విలేకరుల ఎదుట ఆమె వాపోయారు. రుణం గ్రూపు పొదుపు ఖాతాలో జమైందని, బ్యాంకు లింకేజీ రుణం చెల్లించకపోవడంతో రుణ ఖాతా, పొదుపు ఖాతా ఎన్‌పీఏ అయ్యిందని సీసీ వివరణ ఇచ్చారు. వాస్తవానికి ఇలాంటి వారికి నిబంధనల మేరకు స్త్రీనిధి రుణం మంజూరు చేయకుండా ఉండాలి. కానీ డబ్బులు తీసుకుని మంజూరు చేసినట్లు స్పష్టం అవుతుంది.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మంగళగిరి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని మహానాడులో నివాసం ఉంటున్న ఇంటూరి నారాయణ (58) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. విజయనగరం జిల్లా బోగాపురం మండలం సుందరపేటకు చెందిన నారాయణ, సత్యవతి దంపతులు కొన్నేళ్లుగా ఇక్కడ ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. గత నెలలో సత్యవతి కంటి వైద్యం కోసం స్వగ్రామానికి వెళ్లారు. ఈలోగా వరదలు రావడంతో ఇంట్లోని సామగ్రి వరదలో కొట్టుకుపోయాయి. దీంతో నిలువనీడలేని ఆయనకు స్థానికంగా ఉన్న ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకులు పార్టీ కార్యాలయంలో ఆశ్రయం కల్పించారు. ఎప్పటి నుంచో మద్యానికి బానిసైన ఆయన ఈనెల 29వ తేదీ అక్కడే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య సత్యవతి సోమవారం తాడేపల్లి పోలీసుస్టేషన్‌కి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు.

కిద్మత్ టీమ్ మానవత్వం: పోలీసుల సహకారంతో మంగళగిరికి చెందిన 'కిద్మత్ టీమ్' సభ్యులు మృతదేహాన్ని మోసుకెళ్లి పట్టణంలోని శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు. వారిని పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి పరిధిలోని పోలకంపాడు మూడు బొమ్మల కూడలిలో సోమవారం ఎదురెదురుగా వస్తోన్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని సీతానగరానికి చెందిన శశికుమార్(27) అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. విజయవాడలోని ఔషధ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఘటన జరిగిన ప్రదేశానికి కుటుంబ సభ్యులు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

లారీ ఢీకొని ..: తాడేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక కనకదుర్గమ్మ వారధిపై ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో విజయవాడ కృష్ణలంకకు చెందిన కృపామనోజ్ (21) అక్కడికక్కడే మృతి చెందాడని తాడేపల్లి పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలిపారు. ఓ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న కృపామనోజ్ తాడేపల్లిలో నగదు రావాల్సి ఉండటంతో వాటి వసూలు కోసం ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు తూర్పు

అర్జీల పరిష్కారం బాధ్యత విభాగాధిపతులదే

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే : స్థానిక సమస్యలపై వస్తున్న అర్జీల పరిష్కారం బాధ్యత విభాగాధిపతులదేనని కమిషనర్ పి. శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కౌన్సిల్ హాల్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించారు. పట్టణ ప్రణాళిక 14, ఇంజినీరింగ్ 26, రెవెన్యూ 7, ప్రజారోగ్యం 3, అకౌంట్స్ విభాగం 3, ఉపాసెల్ 1, ఎన్నికల విభాగం 1 చొప్పున ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం గత వారంలో వచ్చిన అర్జీలు పరిష్కారంపై సమీక్షిస్తామన్నారు. ఒకసారి వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి ఫిర్యాదు, అర్జీని ప్రత్యేక విభాగంలో రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అదనపు కమిషనర్ ఓబులేసు, డీసీలు సీహెచ్. శ్రీనివాస్, డి. శ్రీనివాస్, సీపీ రాంబాబు, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంహెచ్‌వో మధుసూదన్, మేనేజరు ప్రసాద్, ఉపాసెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్వాలిఫైడ్ వార్డు సంక్షేమ కార్యదర్శులకు పోస్టింగ్‌లు

నగరపాలకసంస్థ(గుంటూరు): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బీకాం అర్హతతో క్వాలిఫైడ్ అయిన వార్డు సంక్షేమ కార్యదర్శులు 20 మంది అభ్యర్థులకు జీఎంసీలో సూపర్ న్యూమరీ పోస్టుల్లో ఉద్యోగాలు కల్పించి ఉత్తర్వులు అందించినట్లు కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కౌన్సిల్ హాల్‌లో అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు ఇచ్చారు. నగరపాలక సంస్థకు 34 పోస్టులు మంజూరు చేయగా 20 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలన పూర్తయినట్లు తెలిపారు.



అభ్యర్థినికి ఉద్యోగ ధ్రువపత్రం అందజేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు, ఏసీ ఓబులేసు

ట్రాఫిక్ పోలీసులున్నా.. ప్రయోజనం సున్నా

పట్నంబజారు, న్యూస్‌టుడే

వ్యాపార సముదాయాలకు కేంద్ర బిందువైన పట్నంబజారు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయడంలో పోలీసులు విఫలమవుతున్నారు. ఏలూరుబజారు, పట్నంబజారు, పూల మార్కెట్ సెంటర్, క్లాత్ బజారు సెంటర్లలో వ్యాపార సముదాయాలు అధికంగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఇటీవల పోలీసు ఉన్నతాధికారులు సెంటర్ పార్కింగ్‌ను తొలగించారు. దాని స్థానంలో రోజుకు ఒకవైపు చొప్పున వాహనాలు నిలిపే విధానాన్ని అమలు చేశారు. దీంతో రద్దీ ప్రదేశాల్లో కొంతమేర ట్రాఫిక్ సమస్య తగ్గుముఖం పట్టింది.

☛ పట్నంబజారు, ఏలూరు బజారు ప్రాంతాల్లో నిత్యం ఒక హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నా ఆటోలు మాత్రం ఇష్టానుసారం రోడ్డుకు అడ్డదిడ్డంగా నిలిపేస్తున్నారు. వాటిపై చర్యలు తీసుకోకుండా ట్రాఫిక్ పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు వ్యాపారులు పెదవి విరుస్తున్నారు. ఆటోలు నిలపకుండా తగిన చర్యలు తీసుకుంటే ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించవచ్చని వ్యాపారులు పేర్కొంటున్నారు.



పట్నంబజారులో ఇష్టానుసారంగా నిలిపిన ఆటోలు

విజేతలకు బహుమతుల ప్రదానం

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర- 2047 విద్యారంగంలో దార్శనిక ప్రణాళిక తయారీలో భాగంగా జిల్లా స్థాయిలో స్థానిక డీసీఈబీలో వివిధ రకాల పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వం, చర్చా పోటీలు నిర్వహించగా వివిధ మండలాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో శైలజ, ఎస్ఎస్ఏ ఏపీసీ విజయలక్ష్మి, ఉపవిద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, ఎంఈవో జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన.. షేక్ నజ్మా(నారాకోడూరు జడ్పీ హైస్కూల్), టి.ఐశ్వర్య (ఉప్పలపాడు), ఆర్.లోకేశ్వరి (కొల్లిపర) విజేతలుగా నిలిచారు. వక్తృత్వం.. జె.స్నేహశ్రీ (మంగళగిరి వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్), డి. ధరణి (నారాకోడూరు), బి.సోమసహస్ర (ఉండవల్లి ఎంపీయూపీ స్కూల్) గెలుపొందారు. చర్చా పోటీల్లో.. ఎం.లహరి, డి.ధరణి(నారాకోడూరు), జె.సుప్రియ, వి.తరుణి, (మాచవరం, పొన్నూరు మండలం), ఎస్.పూజసహస్ర, సీహెచ్.అనుహ్య (పచ్చలతాడిపర్రు డాన్‌బోస్కో ఉన్నత పాఠశాల, పొన్నూరు మండలం) విద్యార్థినులు వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు.

నిజాయతీ చాటుకున్న బాటసారి

పట్నంబజారు, న్యూస్‌టుడే : దారిలో దొరికిన నగదు బ్యాగును ఓ వ్యక్తి పోలీసులకు అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. లాలాపేట పోలీసుల వివరాల ప్రకారం.. కాట్రపాడు గ్రామానికి చెందిన కసుకుర్తి ఝాన్సీ ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై గుంటూరు నుంచి వెళ్తుండగా మార్కెట్ సెంటర్‌లో బ్యాగు రోడ్డుపై పడింది. ఆమె ఇంటికి వెళ్లిన తరువాత బ్యాగ్ పోయినట్లు గుర్తించారు. ఈ క్రమంలో మార్కెట్ సెంటర్‌లో పడిన బ్యాగ్‌ను అటుగా వెళ్తున్న సుద్దపల్లిడొంక రోడ్డుకు చెందిన షేక్ అల్లాబక్షు గుర్తించి లాలాపేట పోలీసులకు అప్పగించారు. బ్యాగ్‌లో ఉన్న చిరునామా ప్రకారం పోలీసులు సోమవారం ఝాన్సీని పోలీసుస్టేషన్‌కు పిలిపించి బ్యాగ్ అప్పగించారు. అందులో రూ.16 వేల నగదు, ఇతర డాక్యుమెంట్లు ఆమెకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. నిజాయతీ చాటిన అల్లాబక్షును లాలాపేట సీఐ శివప్రసాద్‌తోపాటు పోలీసులు అభినందించారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

ఎన్టీఆర్ సర్కిల్: తెదేపా కూటమి ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. శారదా కాలనీకి చెందిన వేద ప్రకాష్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5లక్షలు మంజూరు చేయించి నసీర్ వారికి సోమవారం అందజేశారు. కార్పొరేటర్ ముప్పవరపు భారతి, మాజీ కార్పొరేటర్ గోళ్ల ప్రభాకర్, తెదేపా నాయకులు గుడిమెట్ల దయారత్నం తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా పథకం చంద్రబాబు మానస పుత్రిక

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే : డ్వాక్రా పథకం ముఖ్యమంత్రి చంద్రబాబు మానస పుత్రిక అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర గ్రంథాలయం ప్రాంగణంలో డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన ప్రారంభించారు.

3 నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

పట్నంబజారు: గంటలమ్మ చెట్టు వీధిలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి 162వ దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు కొత్తూరి వెంకట నరసింహారావు తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వేడుకల గోడప్రతిని ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఆలయ అధ్యక్షుడు తెల్లాకుల లక్ష్మీ గురుప్రసాద్, కార్యదర్శి పెనుగొండ వెంకట శ్రీనివాసరావు, కోశాధికారి ఘంటసాల వెంకట సత్య సురేష్, గౌరవ సలహాదారుడు సాతులూరి ప్రకాశరావు, డోగిపర్తి సుజాత తదితరులున్నారు. సంగడిగుంటలోని శ్రీ కనకదుర్గా అమ్మవారి దేవస్థానంలో ఈనెల 3వ తేదీ నుంచి దసరా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు మారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఆయన ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు.

సమస్యలు పరిష్కరించండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : వర్షాలకు గుంటూరు నగరం అస్తవ్యస్తంగా మారుతోందని, జలమయం అవుతోందని, పరిష్కార మార్గం చూడాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. సోమవారం ఏటీ అగ్రహారంలో నగర సమితి సమావేశం నిర్వహించారు. నాయకులు చిన్న, అంజిబాబు, శ్రీనివాసరావు మరియదాసు, వాసు, శ్రీను, రమణయ్య, ఖాసిం పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

పట్నంబజారు: బి.ఆర్. స్టేడియంకు వెళ్లే దారిలో పేరుకుపోయిన వ్యర్థాలను సోమవారం కార్పొరేషన్ అధికారులు తొలగించారు. 'స్టేడియానికి వెళ్లాలంటే భయం' శీర్షికన గత నెల 12వ తేదీన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆ ప్రాంతంలో పేరుకుపోయిన వ్యర్థాల్ని తొలగించి, చదును చేశారు. గతంలో పాతగుంటూరు చుట్టు పక్కల ప్రాంతాల్లో సేకరించిన వ్యర్థాలను అధికారులు స్టేడియానికి వెళ్లే దారిలో గుట్టలుగా పోశారు. ప్రస్తుతం ఆ ప్రాంతాన్ని చదును చేయడంతో ఇటుగా రాకపోకలు సాగించేవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చదును చేసిన ప్రాంతం

చెరువుల అభివృద్ధికి చర్యలు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : నగరంలోని చెరువులు, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ పి. శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం సమ్మర్‌పేట చెరువును స్థానిక కార్పొరేటర్ బి.స్మితపద్మజ, ఇతర అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. సమ్మర్‌పేట చెరువులో మురుగు కలుస్తోందని స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, మురుగునీరు కలవకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఏసీపీ మురళి, డీఈఈ హనీఫ్, ఎస్ఎస్ సోమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

2న స్వచ్ఛతా హీ సేవ ముగింపు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే : స్వచ్ఛతా హీ సేవ ముగింపు సందర్భంగా ఈ నెల 2న పలు కార్యక్రమాలు ఉంటాయని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కౌన్సిల్ హాల్‌లో విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అక్టోబరు 2 బుధవారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజా భాగస్వామ్యంతో మెగా మాస్ స్వచ్ఛత కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రజారోగ్య కార్మికులకు సన్మానం, పీపీఈ కిట్ల పంపిణీ ఉంటుందని తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

వివాహిత బలవన్మరణం

పట్నంబజారు, న్యూస్‌టుడే : కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. లాలాపేట పోలీసుల వివరాల ప్రకారం.. సాయిబాబా కాలనీకి చెందిన తురక తిరుపతమ్మకు, వెంకటేశ్వర్లుకు 18 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి ముగ్గురు పిల్లలు. కొద్ది రోజుల నుంచి దంపతుల మధ్య తగాదాలు జరుగుతున్నాయి. వెంకటేశ్వర్లుకు ఆయన తల్లి వత్తాసు పలుకుతోంది. తీవ్ర మనస్తాపానికి గురైన తిరుపతమ్మ గత నెల 23వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకలమందు తిన్నది. వెంటనే ఆమెను ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ తిరుపతమ్మ ఆదివారం రాత్రి మృతి చెందింది. లాలాపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి

పట్నంబజారు: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని గుంటూరు పార్లమెంటు పరిశీలకుడు శ్రీపతి ప్రకాశం అన్నారు. రాజీవ్‌గాంధీ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

పట్నంబజారు, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడం సిగ్గు చేటని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా సోమవారం పాతగుంటూరులోని శివాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు బోనబోయిన శ్రీనివాస యాదవ్, గాదె వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ యల్లావుల అశోక్, తెలుగుదేశం పార్టీ నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు, జ్యోతుల జస్వంత్, దొంతాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దీనుల ఆ'వేదన'లు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి బాధితులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వారి నుంచి ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ రమేష్, సుబ్బారావు, శివాజీరాజు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆస్తితగాదాలు, కుటుంబ కలహాలు, నకిలీ పత్రాలు, ప్రేమ పేరుతో మోసం, ఉద్యోగాల పేరుతో మోసం తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీలు సీతారామయ్య, సీఐలు రాంబాబు, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

కుమార్తె మృతికి కారకులను అరెస్టు చేయండి: లీల

నా ఒక్కగానొక్క కుమార్తె జననీ (21) డిగ్రీ చదువుకుంది. చిలకలూరిపేటకు చెందిన ఆనంద్ మా అమ్మాయి వెంటపడి ప్రేమిస్తున్నానని 2022లో మాకు తెలియకుండా తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు. నల్లపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. కొంత కాలానికి ఆనంద్ వద్ద ఉన్నట్లు తెలిసింది. అతను తరచూ మా అమ్మాయిని వేధింపులకు గురిచేస్తుండేవాడు. గర్భిణిగా ఉన్న సమయంలో సరైన వైద్యం చేయించలేదు. 2023లో మా కుమార్తె ఆడ శిశువును ప్రసవించి చనిపోయింది. నా కుమార్తెను కొట్టడం, చిత్రహింసల కారణంగానే చనిపోయింది. నా బిడ్డ చావుకు ఆనంద్, అతని కుటుంబ సభ్యులు కారణం. మా ఫిర్యాదును పట్టించుకోకుండా మేం ఆనంద్ ఇంటిపైకి వెళ్లి దాడి చేశామని పోలీసులు తిరిగి మాపైనే తప్పుడు కేసు పెట్టారు. ఇదెక్కడి అన్యాయం అని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసి మిగిలిన నలుగురిని అరెస్టు చేయలేదు. నిందితులందరిని అరెస్టు చేసి మాకు న్యాయం చేయాలని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాను.



కానిస్టేబుల్ శ్రీనివాసరావును సత్కరించిన అధికారులు

శ్రీనివాసరావు సేవలు ప్రశంసనీయం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన కానిస్టేబులు సీహెచ్ శ్రీనివాసరావును పోలీసు కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సత్కరించి జ్ఞాపిక అందించారు. పోలీసుశాఖలో శ్రీనివాసరావు సేవలు ప్రశంసనీయన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ హనుమంతు, డీఎస్పీ సీతారామయ్య, ఆర్ఐలు శ్రీనివాసరావు, బ్రహ్మానందం పాల్గొన్నారు.

నగరంపాలెం సీఐగా వీరానాయక్



గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంపాలెం సీఐగా ఎల్. వీరానాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మహిళల రక్షణ, భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని, అసాంఘిక శక్తులు, రౌడీషీటర్లపై నిఘాపెట్టి చర్యలు తీసుకుంటామని 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

ఆబ్కారీ సీఐలుగా బాధ్యతలు



నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ఆబ్కారీశాఖ గుంటూరు-2 పోలీసుస్టేషన్ సీఐగా **ఎం. యశోదరదేవి** సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆబ్కారీ శాఖ గుంటూరు-1 పోలీసుస్టేషన్ సీఐగా **లత** సోమవారం బాధ్యతలు స్వీకరించారు.



హమాలీ కూలి పెంచాలని వినతి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : సివిల్ సప్లయిస్ హమాలీ కూలి పెంచి జీవో విడుదల చేసేలా చూడాలని కోరుతూ సోమవారం సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌కు తన కార్యాలయంలో హమాలీ ముఠా కూలీల సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, రాష్ట్ర ఉప కార్యదర్శి అంజిబాబు వినతిపత్రం అందించారు.

పీవీజీ రాజు శతజయంతి సభకు రండి

గుంటూరు నగరం, న్యూస్‌టుడే : గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెలాఖరులో విజయనగరం మహారాజు పీవీజీ రాజు శతజయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జరిగే సభకు రావాలని కేంద్ర మాజీ మంత్రి పి. అశోక్ గజపతిరాజును ఆహ్వానించినట్లు ఠాగూర్ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి రామచంద్రరాజు సోమవారం తెలిపారు. ప్రముఖ గాయకులు డాక్టర్ గజల్ శ్రీనివాస్‌తో కలిసి విజయనగరంలో కేంద్ర మాజీ మంత్రిని కలిసి శతజయంతి సభకు హాజరవ్వాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.



అశోక్ గజపతిరాజుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న రామచంద్రరాజు, గజల్ శ్రీనివాస్

దాడి ఘటనపై పరస్పర కేసులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : మంగళదాస్‌నగర్‌కు చెందిన ఖాసిం కారు మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తన కుటుంబ సభ్యులకు మందుబిళ్లలు తీసుకోవటానికి రాజాగారితోటలోని దుకాణం వద్దకు వెళ్లారు. మద్యం తాగి ఉన్న ఖాసిం మందుల దుకాణంలోని వ్యక్తితో గొడవపడ్డాడు. అదే సమయంలో అక్కడ ఉన్న ఆర్టీసీ కాలనీకి చెందిన జమీర్ ఎందుకు గొడవపడుతున్నావని ఖాసింను ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఖాసిం తన వద్ద ఉన్న చిన్నచాకుతో జమీర్ శరీరంపై పలుచోట్ల పొడిచాడు. జమీర్ ఫిర్యాదు మేరకు ఖాసింపై కేసు నమోదు చేశామని సీఐ వీరయ్య తెలిపారు. జమీర్ తనతో గొడవపెట్టుకొని రాయితో తలపగలకొట్టాడని ఖాసిం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

గుంటూరు పశ్చిమ

ఒక్క మాతృ మరణం సంభవించకూడదు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: జిల్లాలో ఒక్క మాతృ మరణం కూడా జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయలక్ష్మి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సోమవారం సాయంత్రం సెప్టెంబరులో సంభవించిన మూడు మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రసవ సమయంలో మహిళలు మరణించడానికి కారణాలను అధ్యయనం చేసి తెలుసుకున్న అంశాల ఆధారంగా మరణాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం లోతైన విశ్లేషణ అవసరమన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


ఎమ్మెల్యే మాధవికి సమస్యలు తెలియజేస్తున్న మారుతీనగర్ వాసులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మారుతీనగర్‌లోని ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, ఇళ్లలోకి మురుగునీరు వస్తోందని స్థానికులు పేర్కొన్నారు. ఆమె అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. శ్రీనివాసరావుతోటలో అధ్వానంగా ఉన్న రోడ్లను అభివృద్ధి చేయాలని, గత ప్రభుత్వంలో తొలగించిన పింఛన్లు పునరుద్ధరించి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

నగరంపాలెం సీఐగా వీరానాయక్



గుంటూరు నేరవార్తలు, పట్టాభిపురం, న్యూస్‌టుడే: నగరంపాలెం సీఐగా ఎల్.వీరనాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మహిళల రక్షణ, భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని, అసాంఘిక శక్తులు, రౌడీషీటర్లపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామని 'న్యూస్‌టుడే'కు తెలిపారు. సీఐ వీరానాయక్ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే గళ్లా మాధవిని కలిశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గంజాయి అనే మాట నియోజకవర్గంలో వినపడకూడదన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు.

'వైకాపా పాపాలకు ప్రాయశ్చిత్తం లేదు'

గుంటూరు పశ్చిమ, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదంలో నాటి వైకాపా ప్రభుత్వం చేసిన అపవిత్రానికి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా సోమవారం శ్రీనివాసరావుతోటలోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో దీపారాధన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ల హరి మాట్లాడుతూ వైకాపా పాపాలకు ప్రాయశ్చిత్తం లేదన్నారు. జగన్ పాలనలో ప్రజలకే కాకుండా దేవాలయాలకు కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. అన్ని మతాల హితమే పవన్ కల్యాణ్ అభిమతమన్నారు. వైకాపా హయాంలో ప్రమాదకర స్థితిలోకి నెట్టేసిన సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీవీరాంజనేయస్వామి ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, తోట వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు శ్రావణకుమారి, నంది సరస్వతి, ఆళ్ళ శిరీష, సవరం రాజ్యలక్ష్మి, రామిశెట్టి ధరణి, అంజలి, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాసరావుతోటలోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో దీపారాధనలో కూటమి నాయకులు

ఆవుల సంచారంతో
చోదకులకు తప్పని అవస్థ
తరచూ ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు


అమరావతి రోడ్డు మధ్యలో ఆవులు

గోరంట్ల, న్యూస్‌టుడే

అమరావతి రోడ్డులో ముందు వాహనాన్ని దాటేందుకు ఆటో వేగంగా డివైడర్ వైపు దూసుకొచ్చింది. అక్కడ రోడ్డుపై ఆవులు పడుకుని ఉన్నాయి. అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. మెల్లగా వాహనాలను, ఆవులను తప్పించుకుని ముందుకెళ్లాడు. శుక్రవారం సాయంత్రం సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రెప్పపాటులో ప్రమాదం తప్పిందని ఆ ఆటోడ్రైవర్ బతుకు జీవుడా అనుకుంటూ వెళ్లాడు. ఇలాంటి సంఘటనలు గుంటూరు నగరంలో నిత్యకృత్యంగా మారాయి. ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో సైతం సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకుని ఇంటికెళ్లిపోతున్నారు.

గుంటూరు నగరంలో రోడ్లపై ఆవులు, నగరాలు పరిసర ప్రాంతాల్లో అయితే పందులు కూడా నిత్యం రోడ్లపైనే తిరుగుతున్నాయి. దీంతో రాకపోకల సమయంలో వాహన చోదకులు వాటి నుంచి సురక్షితంగా దాటితే చాలనుకునే పరిస్థితి నెలకొంటుంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పశువులను వేరే ప్రాంతానికి తరలించేందుకు నగరపాలక సంస్థ చేపడుతున్న చర్యలు మాత్రం శూన్యం. పశువులు ఢీకొని ప్రమాదం జరిగినా వాటిపై ఎవరికి ఫిర్యాదు చేయలేక గాయపడిన వారు సైతం గమ్మునుండిపోతున్నారు. ఈ తరహా ప్రమాదాలను వెలికితీస్తే రోజూ పదుల సంఖ్యలో ఉంటాయంటున్నారు చోదకులు.

తరలిస్తామని చెబుతారంతే..

మూడున్నరేళ్లుగా నగరంలో తిరిగే ఆవులను శివారుకు తరలించి అక్కడ ఉంచేలా ఏర్పాటు చేస్తామని నగరపాలక సంస్థ అధికారులు చెబుతూనే ఉన్నారు. కానీ ఆ మాటలు అప్పటికి తాత్కాలికంగా పని చేస్తున్నాయే తప్ప శాశ్వతంగా మాత్రం పరిష్కారం కావడం లేదు. నిత్యం నగరంలో వివిధ పనులపై వాహన చోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలోనే రోడ్లపై అడ్డంగా పశువులు నిలిచి ఎంత హారన్ కొట్టినా పక్కకు తప్పుకునే పరిస్థితి ఉండదు. కొన్నిసార్లు రోడ్డు పైనే అడ్డంగా పడుకుని రాకపోకలకు ఇబ్బంది కల్గిస్తున్నాయి. నగరాలు, కొరిటెపాడు, అరండల్‌పేట, బ్రాడీపేట, పట్టాభిపురం తదితర ప్రాంతాల్లో ఆవులు రోడ్లపై తిరుగుతూనే ఉన్నాయి.

☛ ఇటీవల జిల్లా ప్రధాన న్యాయమూర్తి సైతం నగరంలో ఆవులు రోడ్లపై తిరుగుతుండడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారని నగరపాలక సంస్థ అధికారులకు సూచించి సమస్య పరిష్కరించాలన్నారు. అయినప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా ప్రజల ప్రాణాలను కాపాడేందుకు నగరపాలక సంస్థ అధికారులు ఆవులను రోడ్లపై నుంచి కేంద్రాలకు తరలించి సంరక్షించాలని నగరవాసులు కోరుతున్నారు.

2న స్వచ్ఛతా హీ సేవ ముగింపు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే : స్వచ్ఛతా హీ సేవ ముగింపు సందర్భంగా ఈ నెల 2న పలు కార్యక్రమాలు ఉంటాయని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కౌన్సిల్ హాల్‌లో విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అక్టోబరు 2న మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా భాగస్వామ్యంతో మెగా మాస్ స్వచ్ఛత కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రజారోగ్య కార్మికులకు సన్మానం, పీపీఈ కిట్ల పంపిణీ ఉంటుందని తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ఇక వీరి ప్రపంచం వీనులవిందు


వినికిడి యంత్రాన్ని అందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం ద్వారా స్వరూప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వినికిడి యంత్రాలను విభిన్న ప్రతిభావంతులకు పంపిణీ చేశారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చేతుల మీదుగా వీటిని చిన్నారులకు అందించారు. ఎన్జీవో కల్యాణ మండపంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో 150 మందికి ట్రస్ట్ తరపున యంత్రాలను అందించారు. చిన్నారులకు అవసరమైన ఈ యంత్రాలను సమకూర్చడంపై ట్రస్ట్ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, స్వరూప్ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి రవిశర్మ, ఆర్బీఎస్కే సమన్వయకర్త డాక్టర్ ఎ.శ్రావణబాబు తదితరులు పాల్గొన్నారు.

గుంత.. ప్రమాదకరంగా మారి..



నగరంలోని బ్రాడీపేట 6వలైన్ 19వ అడ్డరోడ్డులో 15 రోజుల క్రితం అపార్ట్‌మెంట్‌లో మంచినీరు రావడంలేదని గుంత తీసి బాగు చేశారు. పని పూర్తయిన తర్వాత పూడ్చడం మరిచారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఈ గుంత దగ్గర దుకాణాలు ఉన్నాయని, రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంత పూడ్చాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గుంటూరు పశ్చిమ

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే : తెదేపా కూటమి ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. శారదా కాలనీకి చెందిన వేద ప్రకాష్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5లక్షలు మంజూరు చేయించి నసీర్ వారికి సోమవారం అందజేశారు.

సీనియర్ డీవోఎం బదిలీ

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజరుగా పని చేస్తున్న దినేష్‌కుమార్‌ను విజయవాడ డివిజన్‌కు బదిలీ చేస్తూ ద.మ. రైల్వే ఏపీవో నరసింహ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాందేడ్ డివిజన్‌లో పని చేస్తున్న శ్రీనాథ్‌ను గుంటూరుకు మార్చారు. విజయవాడలో పని చేస్తున్న సత్యస్వరూప్‌ను నాందేడ్‌కు బదిలీ చేశారు.





3 నుంచి శ్రీశారదా పరమేశ్వరి దేవస్థానంలో ఉత్సవాలు


ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న ఆంజనేయ చయనులు తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సంపత్‌నగర్ శ్రీశారదా పరమేశ్వరి దేవస్థానంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వేదపండితుడు విష్ణుభట్ల ఆంజనేయ చయనులు తెలిపారు. దేవస్థానంలో సోమవారం ఆయన ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించి మాట్లాడారు. ఉత్సవాల్లో రోజూ ప్రాతఃకాల అర్చన సంకల్పం, గురుప్రార్థన, శ్రీశారదా పరమేశ్వరి అమ్మవారి పాదుకలకు, గురుపాదుకలకు సువర్ణ, రజత పుష్పాలు, నాణేలు, పూలతో అష్టోత్తర, త్రిశతి, సహస్రనామ పూజలు, నారాయణ సేవ, శ్రీచక్ర నవావరణ అర్చన, లక్ష కుంకుమార్చన, దేవాలయ ప్రాంగణంలో శారదా పరమేశ్వరి రథోత్సవం, మహామంగళ హారతి, మంత్రపుష్పం, అష్టావధాన సేవ, సువాసినీ పూజ ఉంటాయన్నారు.

విశేష కార్యక్రమాలు: భాద్రపద అమావాస్య సందర్భంగా బుధవారం ఉదయం శారదా పరమేశ్వరి అమ్మవారికి పంచ గంగోదకం, పంచామృతాలతో మహాభిషేకం జరుగుతుంది. 9న ఉదయం మూలానక్షత్రం రోజున సరస్వతీపూజ, సాయంత్రం వేదసభ, 10న సాయంత్రం కాత్యాయని వ్రతం ఉంటాయన్నారు. సమావేశంలో కోట నాగరాజశర్మ, పోలిశెట్టి, నాగ సుందరం, పులికొండ పిచ్చయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి పోలేరమ్మ తల్లి ఆలయంలో దసరా నవరాత్రులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: చుట్టుగుంట కూడలిలోని పోలేరమ్మ తల్లి దేవస్థానం 21వ శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు వైభవంగా జరుగుతాయని నిర్వాహకుడు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. సోమవారం ఆలయంలో ఆయన ఉత్సవ వివరాల ఆహ్వాన పత్రికలను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో అమ్మవారు ప్రతిరోజు ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. రోజు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు అడకా శ్రీనివాసులు, అంగడి శ్రీనివాసరావు, అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, కాండ్రకొండ గురవయ్య, యర్రం కృష్ణారెడ్డి, భవనం శ్రీనివాసరెడ్డి, కుమ్మర చంద్రశేఖర్ ప్రసాద్, సాంబిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు నేరవార్తలు, నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆబ్కారీ శాఖ గుంటూరు-1 పోలీసుస్టేషన్ సీఐగా లత

ఆబ్కారీ గుంటూరు-1 సీఐగా లత



సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో పొన్నూరు, పర్చూరు, చీమకుర్తి, చిలకలూరిపేట, సింగరాయకొండ, ఒంగోలు, గుంటూరు సెబ్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించారు.

వేలం ప్రకటన

In The Court of The Ist Addl Senior Civil Judge: Guntur
EP.No.67/2023 In Dispute No. 07/2020

Between: M/s. Margadarsi Chit Fund Pvt Ltd Reb by its Senior Manager, Market Centre, Guntur. **... Decree Holder**

And

Mrs. Ponnaganti Satyavardhani ... Judgement Debtor No.5

పై నెంబరు E.Pలో Decree Holder కు రావలసిన బాకీ నిమిత్తము Mrs. Ponnaganti Satyavardhani, W/o Ponnaganti Venkateswara Rao, Jdr No.5 చెందిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థి ది: 17-10-2024 తేదిన పై కోర్టు ఉత్తర్వుల మేరకు వేలం జరిపించుటకు ఉత్తర్వులు పొందియున్నారు. ది. 17-10-2024వ తేదిన శ్రీ కోర్టు వారి ఎదుట వేలం జరుగునని వేలంలో పాల్గొనదలిచినవారు పై కోర్టు ఎదుట హాజరు అయి వేలపు షరతులకు లోబడి పాల్గొనవచ్చునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: Guntur Dist, Nallapadu Sub-Registrar, Nallapadu Grama Sivaru, Turakapalem Grama Panchayat Area, Nallapadu Village, Survey No.507, Door No: 5-15, Assesment No.20, an extent of 176.44 Sq.yds site with in the R.C.C Building and asbestos house is bounded by: **East:** this Prop. Ponnaganti Veeraswamy left Road 36.3 Ft, **South:** Panchyati Bazar 51.6 ft, **West:** Ponnaganti Alivelamma site 24.3 ft, **North:** Ponnaganti Veeraswamy Property 53.6 ft.

DH.r Value Rs. 35,00,000/-
Amin Value Rs. 40,00,000/-
వేలం వాయిదా: 17-10-2024
Further Hearing Date: **24-10-2024.**
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)

ఇట్లు, Sri K.Seetha Ramaiah, Sri K.Sreenivas, Smt.D.S.K.Kumari, Advocate for D.H.r, 1/5 Brodipet, Guntur, 9603911172, 9848217711.

ఆబ్కారీ గుంటూరు-2 సీఐగా యశోదరదేవి



నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ఆబ్కారీశాఖ గుంటూరు-2 పోలీసుస్టేషన్ సీఐగా ఎం. యశోదరదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో రేపల్లె, పొన్నూరు, గుంటూరు, పర్చూరు, బుచ్చిరెడ్డిపాలెం, పెదకూరపాడులో విధులు నిర్వహించారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును దొంగలు అపహరించుకుపోయారు. ఎస్వీఎన్ కాలనీలోని రెండో లైనులో నివాసం ఉంటున్న వృద్ధురాలు కాశీ అన్నపూర్ణమ్మ బాత్రూంకి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి వెనుక వైపు నుంచి లోపలకు ప్రవేశించారు. లైట్లు ఆపేసి ఆమె మెడలోని బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యారు. ఈ విషయాన్ని ఆమె బంధువులకు తెలియజేయగా.. వారు పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: జూదం ఆడుతున్న ఏడుగుర్ని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. జేకేసీ కళాశాల ఎదురు రోడ్డులో మోహన్‌రెడ్డి జూద గృహం నడుపుతున్నాడు. సమాచారం అందుకున్న పట్టాభిపురం పోలీసులు దాడి చేయగా ఏడుగురు జూదం ఆడుతూ పట్టుబడ్డారు. వారిని అరెస్టు చేసి రూ.27,740 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత


కలెక్టరేట్: కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో సోమవారం నలుగురికి కారుణ్య నియామక పత్రాలను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ ఎ.భార్గవ్ తేజ అందించారు.

పొన్నూరు తహసీల్దారుగా జియా

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: పొన్నూరు తహసీల్దారుగా జియా ఉల్ హక్‌ను నియమిస్తూ కలెక్టర్ నాగలక్ష్మి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ✤ పల్నాడు జిల్లా నుంచి ముగ్గురు డీటీలకు గుంటూరు జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. జిల్లాలో వీఆర్వోల బదిలీ పోస్టింగ్ ఉత్తర్వులను జిల్లా పాలనాధికారి కార్యాలయం నుంచి సోమవారం విడుదలయ్యాయి. 150 మంది వరకు వీఆర్వోలను బదిలీలు చేసినట్లుగా తెలిసింది.

పీవీజీ రాజు శతజయంతి సభకు రండి

గుంటూరు నగరం: గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెలాఖరులో విజయనగరం మహారాజు పీవీజీ రాజు శతజయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జరిగే సభకు రావాలని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును ఆహ్వానించినట్లు ఠాగూర్ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి రామచంద్రరాజు సోమవారం తెలిపారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరాళం అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఈవో, ఎండీ మణిమేఖలై, ఆ బ్యాంకు అధికారులు ★ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ అధ్యక్షుడు డాక్టర్ సి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రాజయ్య, కార్యదర్శి పి.లక్ష్మణరావు ★ ఆర్జా స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీధర్ కృష్ణమూర్తి. చిత్రంలో బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ తదితరులు

వరద బాధితులకు అండ

• సీఎం సహాయనిధికి పలువురు విరాళాలు




మంత్రి లోకేశ్‌కు విరాళం అందజేస్తున్న పెన్వర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎండీ ఫిలిప్స్ థామస్ తదితరులు ★ శశివిద్యా సంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ తదితరులు

ఈనాడు డిజిటల్, అమరావతి, న్యూస్‌టుడే యంత్రాంగం: ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు పలువురు వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు వరద బాధితుల్ని ఆదుకోవడానికి ముందుకొస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కి విరాళాలు అందిస్తున్నారు. సోమవారం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను పలువురు కలిసి విరాళాల చెక్కుల్ని అందజేశారు.

యూనియన్ బ్యాంకు ఉద్యోగుల ఒకరోజు వేతనం

వరద బాధితుల సహాయార్థం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు తమ ఒకరోజు వేతనం రూ.5,90,01,087ను విరాళంగా ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును సీఈవో, ఎండీ ఎ.మణిమేఖలై సీఎం చంద్రబాబుకు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధులు ఎస్.రామసుబ్రహ్మణియన్, సీవీఎన్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

✦ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సి.నాగేశ్వరావు, వైస్ ప్రెసిడెంట్ ఎం.రాజయ్య, కార్యదర్శి పి.లక్ష్మణరావు రూ.కోటి విరాళం ప్రకటించారు. ఈ మేరకు చెక్కును చంద్రబాబుకు అందజేశారు.

✦ ఆర్జా స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీధర్‌కృష్ణమూర్తి రూ.కోటి అందజేశారు. విరాళానికి సంబంధించిన చెక్కును ముఖ్యమంత్రికి ఇచ్చారు.

✦ కేరళకు చెందిన పెన్వర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎండీ ఫిలిప్స్ థామస్ రూ.50 లక్షల చెక్కును మంత్రి లోకేశ్‌కు ఇచ్చారు.

✦ విజయవాడకు చెందిన ఇండిపెండెంట్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ఐసీఎంఏ) ప్రతినిధులు రూ.50 లక్షల విరాళం ఇచ్చారు. ఈ మేరకు చెక్కును మంత్రి లోకేశ్‌కు అందజేశారు.

✦ బెంగళూరుకు చెందిన తెలుగు విజ్ఞాన సమితి ప్రతినిధులు ఎ.రాధాకృష్ణరాజు, ఆర్.ఆదికేశవులునాయుడు రూ.25 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు.


✦ శశి విద్యా సంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.25 లక్షల విరాళమిచ్చారు. ఈ మేరకు మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేశారు. ఆ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ తమ విద్యా సంస్థల తరఫున గతంలో రూ. కోటి విరాళం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతో మరో రూ.25 లక్షలు అందించడం సంతోషకరమన్నారు.

వ్యక్తి/సంస్థ	సాయం (రూ.లలో)
అసోసియేషన్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా	10 లక్షలు
ఎం.అప్పారావు	10 లక్షలు
చిన్మయ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్	10 లక్షలు

✦ అనంతపురానికి చెందిన కేఎం షకీల్ షఫి నేతృత్వంలో ఏపీ వక్ఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ముతావల్లీస్ అండ్ మేనేజింగ్ కమిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.7.86 లక్షల విరాళం అందించారు.

✦ జంపాల భావనారాయణ, శారద అనే వృద్ధులు రూ.లక్ష చెక్కు, 16 గ్రాముల బంగారు బ్రేస్‌లెట్‌ని వరద బాధితులకు విరాళంగా ముఖ్యమంత్రికి అందజేసి తమ ఉదారత చాటుకున్నారు.

✦ తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అచ్చెన్నపాలెంకు చెందిన పాతూరి కేతన్‌చౌదరి అనే బాలుడు తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.10 వేల విరాళాన్ని సీఎంకు అందజేశాడు.



ముఖ్యమంత్రికి విరాళం ఇస్తున్న బెంగళూరుకు చెందిన తెలుగు విజ్ఞాన సమితి ప్రతినిధులు ఎ.రాధాకృష్ణరాజు, ఆర్.ఆదికేశవులునాయుడు తదితరులు



ముఖ్యమంత్రికి విరాళం చెక్కు, 16 గ్రాముల బంగారం అందిస్తున్న వృద్ధులు జంపాల భావనారాయణ, శారద. చిత్రంలో మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి



ఎగువ, దిగువ కాఫర్‌డ్యాం మధ్య నీటిని ఎత్తిపోసేందుకు ఏర్పాటు చేసిన పంపులు

పోలవరానికి తగ్గిన వరద

డయాఫ్రంవాల్ నిర్మాణ ప్రాంతంలో నీరు ఎత్తిపోతకు చర్యలు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన డయాఫ్రంవాల్ నిర్మాణం నవంబరు నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. గోదావరిలో వరద ఉద్ధృతి తగ్గడంతో ప్రధాన డ్యాం ప్రాంతంలోని నీటిని పంపుల ద్వారా బయటకు ఎత్తిపోస్తుండగా.. తాజాగా మరిన్ని పంపులు ఏర్పాటు చేసే పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. దిగువ కాఫర్‌డ్యాం వద్ద సోమవారం నాటికి గుత్తేదారు సంస్థ 23 పంపులు ఏర్పాటు చేసి, నీటిని గోదావరిలోకి మళ్లిస్తున్నారు. సుమారు వంద పంపులు ఏర్పాటు చేయాలని నెల రోజుల కిందటే జలవనరుల శాఖాధికారులు గుత్తేదారు సంస్థకు ప్రణాళిక అందజేశారు. మొన్నటి వరకు రెండు కాఫర్‌డ్యాంల మధ్యనున్న నీరు డీఫ్లింటింగ్ స్లూయిస్ నుంచి నదిలోకి వెళ్లేది. స్లూయిస్ నుంచి నీరు ఆశించిన మేర బయటకు వెళ్లకపోవడంతో పంపుల ద్వారా తోడేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ నెలలో విదేశీ నిపుణుల బృందం మరోసారి ప్రాజెక్టు సందర్శనకు రానుంది. ఈలోపు నీరంతా తోడించి, వారు సమగ్రంగా డయాఫ్రంవాల్ ప్రదేశాన్ని చూసేలా సర్వం సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే కొలికపూడిని సస్పెండ్ చేయాలి

ప్రధాన రహదారిపై మహిళల నిరసన



తిరువూరు మండలం చిట్టేలలో నినాదాలు చేస్తున్న మహిళలు

తిరువూరు, న్యూస్‌టుడే: మహిళా ఉద్యోగుల వాట్సాప్ నంబర్లకు అసభ్యకరంగా సందేశాలు పంపిస్తూ లైంగికంగా వేధిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును తెదేపా అధిష్ఠానం సస్పెండ్ చేయాలని మహిళలు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలంలోని చిట్టేలలో సోమవారం మహిళలు ప్రధాన రహదారిపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. మహిళల పట్ల ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయని మండిపడ్డారు. ఎమ్మెల్యే నుంచి రక్షణ కల్పించాలని కోరారు. కొలికపూడిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

నిజం నిగ్గు తేల్చాలంటున్న ఎమ్మెల్యే: తనపై చేసిన ఆరోపణలు నిజమైతే అరెస్టు చేసి శిక్షించాలని, లేని పక్షంలో ఆరోపణలు చేసిన వారిని శిక్షించాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై ఆరోపణలు చేస్తున్న మహిళ ఇప్పటివరకు నాలుగుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించారని, ఆమె భర్తపై పోలీసులు ఎప్పుడు కేసు పెట్టినా ఇలాంటి ఆత్మహత్య నాటకం ఆడుతారని ఆరోపించారు. తనపై పథకం ప్రకారం చేస్తున్న అసత్య ప్రచారాన్ని నియోజకవర్గ ప్రజలు నమ్మబోరని అన్నారు. అధిష్ఠానం ఆదేశాలతో తన దీక్షను విరమిస్తున్నానని ప్రకటించారు.

‘జగనన్న తోడు’ పథకం పేరు మార్పు

ఈనాడు, అమరావతి: చిరు వ్యాపారుల కోసం ప్రవేశపెట్టిన ‘జగనన్న తోడు’ పథకం పేరును కూటమి ప్రభుత్వం మార్చింది. ఆ పథకానికి ‘చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాలు’గా పేరు పెట్టింది. జగనన్న తోడు పథకం పేరు మార్పు కోసం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ నుంచి వచ్చిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

నిర్మలా సీతారామన్ మీద విచారణపై కర్ణాటక హైకోర్టు స్టే



ఈనాడు, బెంగళూరు: ఎన్నికల బాండ్ల సేకరణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మీద విచారణపై కర్ణాటక హైకోర్టు స్టే విధించింది. తదుపరి విచారణను అక్టోబరు 22వ తేదీకి వాయిదా వేసింది. సోమవారం జస్టిస్ ఎం.నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ .. ప్రతివాదుల నుంచి అభ్యంతరాలు దాఖలయ్యేంత వరకు ప్రాథమిక విచారణ చేపట్టటం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. తదుపరి విచారణ వరకు ఈ స్టే అమలులో ఉంటుందన్నారు. ఐపీసీ సెక్షన్లలో బాధితులకు రక్షణ కల్పించే విధానాలున్నాయని, ఈ కేసులో ఫిర్యాదుదారుడు ఎలాంటి బాధితుడూ కాదని వివరించారు. కేవలం ఈ ఫిర్యాదు ద్వారా ఐపీసీ సెక్షన్ 383 వినియోగం గురించి వెల్లడించాలన్న అభిప్రాయంతో ఉన్నారని పేర్కొన్నారు. ఈ కేసులో మరో నిందితుడు, భాజపా కర్ణాటక శాఖ పూర్వ అధ్యక్షుడు నళిన్ కుమార్ కటీల్.. తనపై కేసు నమోదు చేయవద్దంటూ వేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి విచారణ చేపట్టారు. జనాధికార సంఘ్ పరిషత్ సహాధ్యక్షుడు ఆదర్శ్ అయ్యర్ చేసిన ఫిర్యాదు మేరకు గత శుక్రవారం ప్రత్యేక కోర్టు విచారణకు ఆదేశించింది. శనివారం బెంగళూరులోని తిలక్‌నగర్ పోలీసులు నిర్మలా సీతారామన్‌తో పాటు భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర తదితరులపై కేసు నమోదు చేశారు.

అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈసీ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరినీ ఓటరుగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి కృష్ణా, గుంటూరు డీఆర్వోలు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పదవీకాలం 2025, మార్చి 29తో ముగుస్తుందని, ఈ నేపథ్యంలో ఎన్నికలకు ఓటరు జాబితా రూపకల్పనకు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఓటరుగా నమోదుగా నవంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తారన్నారు. గతంలో ఓటరు జాబితాను ప్రస్తుతం పరిగణనలోకి తీసుకోరని, అందువల్ల ప్రతి ఒక్కరూ నూతనంగా ఓటుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఓటరు నమోదుకు అర్హతలివీ..

2021 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఓటరుగా నమోదుకు అర్హులని, సాధారణ డిగ్రీతో పాటు ఇంటర్ తర్వాత డిప్లొమా చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సాధారణ నివాసై దేశంలో ఎక్కడైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు ఫారం 18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్లలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలుందన్నారు. వచ్చిన దరఖాస్తులను ఏఈఆర్వోలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి అందించాలన్నారు. ఫారం-18 దరఖాస్తులు 1.50 లక్షలు ముద్రించామని, వీటని ఏఈఆర్వోలకు అందించామన్నారు. ఒకే కుటుంబానికి సంబంధించినవి, ఒకే సంస్థలో పనిచేసే వారికి సంబంధించిన దరఖాస్తులు మాత్రమే ఒకేసారి తీసుకునేందుకు అనుమతించాలన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2.50 లక్షల మంది ఓటరుగా నమోదయ్యారని, ప్రస్తుతం 3.50 లక్షల మందిని నమోదు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. వీసీలో డీఆర్వో పి.రోజా, కలెక్టరేట్ ఎన్నికల విభాగ పర్యవేక్షకుడు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

స్థలం ఖాళీ చేయమంటే కేసులు పెడతామంటున్నారు

✤ మాజీ హోంమంత్రి బంధువు బెదిరిస్తున్నారని మహిళ ఆవేదన



కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందించిన చెట్టి జ్యోతిలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: అద్దె డబ్బులు ఇవ్వడంలేదని స్థలం ఖాళీ చేయమంటే కేసులు పెడతామంటున్నారు. మాజీ హోంమంత్రి బంధువని మేకతోటి సుచరిత దృష్టికి తీసుకెళ్లినా.. సమస్య పరిష్కారం కాకపోగా వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. కుమారుడ్ని వైద్య విద్య చదివించేందుకు ఉన్న ఒక్క ఆధారమైన స్థలం ఆక్రమించుకోవడంతో చదువు ఆపేయాల్సిన పరిస్థితి వచ్చిందని కన్నీరుమున్నీరైందామె. కలెక్టరేట్‌లోని ప్రజా సమస్య పరిష్కార వేదికలో సోమవారం వినతిపత్రం అందించిన చెట్టి జ్యోతిలక్ష్మి మీడియాకు తెలిపిన వివరాలివీ.. ‘మాది గుంటూరు విజయపురికాలనీ. నా భర్త పేరుతో వాసవీనగర్ సమీపంలో స్థలం ఉంది. 2019లో ఆ స్థలాన్ని ఉపవిద్యాశాఖాధికారి మేకతోటి వెంకటప్పయ్యకు అద్దెకు ఇచ్చాం. ఆయన తన కుమార్తె పేరుతో సాయిరామ్ కార్స్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. అద్దె చెల్లించకుండా, ఫోన్‌కు స్పందించకపోవడంతో స్పందనలో ఫిర్యాదు చేశాం. అప్పుడు పోలీసుల సమక్షంలో రెండు నెలల్లో ఖాళీ చేస్తానని అంగీకరించారు. తర్వాత.. ఖాళీ చేయమని అడిగితే అట్రాసిటీ కేసు పెడతానని బెదిరించారు. మాజీ మంత్రి మేకతోటి సుచరితకు బంధువు కావడంతో ఆమె వద్దకు వెళ్లి సమస్య చెప్పినప్పటి నుంచి అద్దె డబ్బులు చెల్లిస్తున్నా స్థలాన్ని మాత్రం ఖాళీ చేయడం లేదు. ఈ ఏడాది జనవరిలో నా భర్త నాగమల్లేశ్వరరావు మరణించారు. తర్వాత రెండు నెలల పాటు అద్దె చెల్లించి ఇప్పుడు ఇవ్వడం లేదు. స్థలాన్ని అతనికే అమ్మినట్లు తప్పుడు పత్రాలు సృష్టించారు. ఆర్టీఐ ద్వారా ఈ విషయం తెలుసుకోవడంతో అతను స్థలం విషయంలో ఏమీ చేయవద్దని, లేకుంటే చంపేస్తానని బెదిరిస్తున్నాడు. జూన్‌లో ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. కుమారుడ్ని వైద్య విద్య చదివించేందుకు అదే ఆధారం. అది కూడా ఆక్రమించి బెదిరిస్తున్నారు. అధికారులు స్పందించి స్థలం తమకు దక్కేలా చర్యలు తీసుకోవాలి’.. అని కోరుతున్నారు జ్యోతిలక్ష్మి.

స్థలం కబ్జా చేసి వైకాపా నేతలు రోడ్డు వేశారు

న్యాయం చేయాలని ‘ప్రజా దర్బార్’లో మంత్రి నారా లోకేశ్‌కు విన్నపం



సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో తన స్థలాన్ని కబ్జా చేసి రాత్రికి రాత్రే రోడ్డు నిర్మించారని కృష్ణాజిల్లా అవనిగడ్డకు చెందిన వెంకటేశ్వరరావు గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో సోమవారం జరిగిన ‘ప్రజా దర్బార్’లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కి విజ్ఞప్తి చేశారు. పాత రహదారిని పునరుద్ధరించి అన్యాక్రాంతం చేసిన తన భూమిని ఇప్పించాలని ఇందుకు కారకులైన వైకాపా నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ✤ ఏలేరు కాలువ ఆధునీకరణ కోసం ఆరేళ్ల క్రితం సేకరించిన తమ 60 సెంట్ల వ్యవసాయ భూమికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన పెండ్యాల అమ్మన్న, తాను స్థాపించిన మాతృధరణి ప్రాజెక్టు ప్రయివేటు లిమిటెడ్ కంపెనీని స్వాధీనం చేసుకునేందుకు మంగళగిరి మండలం కాజకు చెందిన ఒంటెద్దు వెంకటేశ్వరరావు, కోటా మురళీకృష్ణ ప్రయత్నిస్తున్నారని, తనకు ప్రాణహాని ఉందని ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం ముడివేములకు చెందిన రామినేని సురేష్‌బాబు ఫిర్యాదు చేశారు. ఇటీవల వరదల్లో తమ పాడి పశువులు గల్లంతయ్యాయని నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన రైతులు మంత్రికి విన్నవించారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పట్నంబజారు, న్యూస్‌టుడే : దసరా పండగ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సుల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. పండగ నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ఈ సర్వీసులు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ నెల 8, 9, 10, 11 తేదీల్లో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాల నుంచి గుంటూరుకు వచ్చే వారి కోసం 130 బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. పండగ అనంతరం గుంటూరు నుంచి తిరిగి హైదరాబాదు, చెన్నై, బెంగళూరు వెళ్లే వారి సౌకర్యార్థం అన్నే సర్వీసులు నడిపేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్ ‘న్యూస్‌టుడే’కు తెలిపారు. సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను ఇందుకోసం వినియోగిస్తామన్నారు.

సీఆర్డీఏ సర్కిల్ ఎస్ఈగా సుబ్రహ్మణ్యం

తుళ్లూరు, న్యూస్‌టుడే: విజయవాడ సెంట్రల్ డిస్కమ్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం సీఆర్డీఏ సర్కిల్ నూతన ఎస్ఈగా నియమితులయ్యారు. ఈ మేరకు సెంట్రల్ డిస్కం సీఎండీ రవి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ప్రత్తిపాటి విజయకుమార్ నరసరావుపేటకు బదిలీ అయ్యారు.

దేవాలయాల నిర్వహణను విశ్వ హిందూ పరిషత్తుకు అప్పగించండి

☛ గుంటూరు కలెక్టరేట్ వద్ద ధర్నాలో వీహెచ్‌పీ నాయకులు



వినతిపత్రం అందించేందుకు గుంటూరు కలెక్టరేట్‌కు వచ్చిన విశ్వహిందూ పరిషత్తు నాయకులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎంతో పవిత్రమైన దేవాలయాల నిర్వహణ చేయలేకపోతే విశ్వహిందూ పరిషత్తుకు అప్పగించాలని పరిషత్తు నాయకులు డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రతకు కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గుంటూరు కలెక్టరేట్ వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పరిషత్ నాయకులు అనిల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం లడ్డూను అపవిత్రం చేసిందని చెబుతున్నారని, దీనిపై పూర్తి స్థాయిలో కమిటీని నియమించి కారకులను అరెస్టు చేయాలన్నారు. రోజులు గడుస్తున్నా ఎవరినీ అరెస్టు చేయకపోవడం దౌర్భాగ్యమైన పరిస్థితన్నారు. హిందూ దేవాలయాలను ప్రభుత్వాలు వారి ఆధీనంలో ఉంచుకుని సర్వనాశనం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆలయాల నిర్వహణ ప్రభుత్వాలకు చేతకావడం లేదని, అయోధ్య రామమందిరం, గుజరాత్‌లో సోమనాథ్ ఆలయాన్ని విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాలు అన్యమతస్థులను తీసుకొచ్చి దేవాలయాల్లో పెట్టి హిందువుల ఆత్మాభిమానాన్ని దెబ్బ తీస్తున్నారన్నారు. కార్యక్రమంలో పరిషత్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి వెంకటప్పారెడ్డి, పలువురు నాయకులు, ధార్మిక సంఘాల ప్రతినిధులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

రబీకి వంగడాలు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న ఆంగ్రూ వీసీ శారద జయలక్ష్మీదేవి, పక్కన శాస్త్రవేత్తలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో రబీ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు అనుకూలమైన పంట వంగడాలను సిద్ధంగా ఉంచాలని ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి అన్నారు. గుంటూరుకు సమీపంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాం ఫాం ఆడిటోరియంలో రబీ సన్నద్ధతపై కార్యశాల సోమవారం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ వివిధ సమస్యలను తట్టుకునే రకాల విత్తనాలతో పాటు సోయాబీన్ పంటపై పరిశోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. జీవన ఎరువులు, జీవ నియంత్రణపై రైతులకు అవగాహన కల్పించడం ద్వారా రసాయనాల వాడకాన్ని తగ్గించవచ్చన్నారు. ఖరీఫ్‌లో అననుకూల వాతావరణ పరిస్థితులతో పంటలకు నష్టం వాటిల్లినందున రానున్న రబీ పంట కాలంలో వివిధ పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి పెంచే దిశగా శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అధిక దిగుబడిని ఇచ్చే రకాలు, సాంకేతికతతో మెరుగైన ఆదాయం అందేలా చూడాలన్నారు. జాతీయ వరి పరిశోధన స్థానం ముఖ్య శాస్త్రవేత్త ఆర్.మహేంద్రకుమార్ ఆరుతడి వరి పండించడం వల్ల కలిగే ఉపయోగాలను.. జాతీయ నూనె గింజల పరిశోధన స్థానం శాస్త్రవేత్త జి.సురేష్ మేలైన రకాలను గురించి తెలిపారు. ఆంగ్రూ పరిశోధన, విస్తరణ విభాగాల సంచాలకుడు పి.వి.సత్యనారాయణ, జి.శివనారాయణ, విశ్రాంత విస్తరణ సంచాలకుడు ఆలపాటి సత్యనారాయణ, లాంఫాం పూర్వ ఏడీఆర్ బి.రోశయ్య పంటల సాగు గురించి వివరించారు. సమావేశంలో ఆరు జోన్ల ఏడీఆర్‌లు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

‘ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్’పై కార్యశాల



ర్యాలీలో వైద్య ఆరోగ్య సిబ్బంది

మంగళగిరి, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ఆధ్వర్యాన మంగళగిరిలో సోమవారం ఆయుష్మాన్ భారత్ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఇంటింటికీ ఆరోగ్యం, ఇంటింటా ఆయుష్మాన్ భారత్ పేరుతో జరిగిన కార్యక్రమంలో ఆ ట్రస్ట్ సీఈవో లక్ష్మీషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కార్యక్రమం ఆరేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌పై కార్యశాల నిర్వహించారు. నెట్‌వర్క్ వైద్యశాలల అసోసియేషన్స్, యాజమాన్యాల నుంచి త్వరలో ప్రవేశపెట్టబోతున్న హైబ్రిడ్ విధానంపై సలహాలు, సూచనలు స్వీకరించామని, వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలను ప్రకటిస్తామని లక్ష్మీషా పేర్కొన్నారు.

చిట్టీల పేరుతో రూ.3 కోట్ల టోకరా



వివరాలు చెబుతున్న బాధితులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ప్రైవేట్ చిట్టీల పేరుతో దంపతులు రూ. 3 కోట్లకుపైగా వసూలు చేసి పరారయ్యారంటూ బాధితులు సోమవారం పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో డీఎస్పీ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు తీసుకోవాలని డీఎస్పీ అధికారులను ఆదేశించారు. బాధితుల్లో కొరిటెపాడు, చైతన్యపురి కాలనీ పరిసర ప్రాంతాలకు చెందిన నాగలక్ష్మి, బసవరాజు, లక్ష్మి తదితరులు విలేకరులతో మాట్లాడారు. ‘చైతన్యపురి కాలనీకి చెందిన దంపతులు చంద్రావతి, సుబ్బారెడ్డి 15 ఏళ్లుగా చిట్టీలు వేస్తున్నారు. వారి మాటలు నమ్మి రూ. లక్షల్లో చిట్టీలు కట్టాం. పాడితే ఆ డబ్బులు ఇవ్వకుండా మరో చిట్టీలో చేరమనేవారు. లేనిపక్షంలో వడ్డీ ఇస్తామంటూ తీసుకునేవాళ్లు. ఏడాదిన్నరగా డబ్బులు ఇవ్వలేదు. అడిగితే దాటవేస్తూ వచ్చారు. ముందే పథకం ప్రకారం తమ సొంత ఇల్లు అమ్మేసుకొని మాకు మాత్రం సెప్టెంబర్ 21న అందరికీ డబ్బులు ఇస్తామని నమ్మించారు. ఆ రోజు రాత్రి ఎవరికీ తెలియకుండా ఇల్లు ఖాళీ చేసి పారిపోయారు. సుమారు రూ.3 కోట్లకు పైగా తీసుకొని మోసగించారు. మా పిల్లల చదువులు, ఆడపిల్లల పెళ్లికి అక్కరకు వస్తాయని కూలి పనులు చేస్తూ కష్టపడి చిట్టీ కట్టుకుంటే మోసగించి పరారయ్యారు. వారిని గుర్తించి మా డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలి’ అని తెలిపారు.